Prajalakshyam Telugu Daily
ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి
సంపుటి: 17 | సంచిక: 97 | కరీంనగర్ | శనివారం 29 ఆగస్టు 2026 | పేజీలు: 12 | వెల: 2.00

రక్షణ రంగంలో మరో ముందడుగు

అమెరికాతో రక్షణ శాఖ జావెలిన్ కొనుగోళ్లు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఆగస్ట్ 28 : భారత్ – అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో 11లో

బిసి, ఇబిసి విద్యార్థులకు చేయూత

- విదేశీ విద్యకోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం
- సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 11లో

బంగారం మైనింగ్‌లో హట్టి - సింగరేణి జతకట్టాలి

- భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి
- సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం
- హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి–సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి 11లో

ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

- వివాదాల తరవాత తొలిసారి సిఎం ఇంటికి కొండా సురేఖ
- సిఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య
- సిఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్

హైదరాబాద్,ఆగస్ట్28 : రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్‌కు రాఖీ కట్టారు. సిఎం కుటుంబ సభ్యులు సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి 11లో

పెనం మీది నుంచి

పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

- కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజల్లో బాధ
- రేషన్ కార్డులపై మోడీ ఫోటో ఎందుకు వేయరు
- సిఎస్ సంజయ్ జాజుతో పలు అంశాలపై చర్చించిన ఈటెల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారయ్యిందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కెసిఆర్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అంతకు మించి అన్నట్లుగా అవినీతి పాలన సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా తయారయ్యింని ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర 11లో

గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

- ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్‌ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శిం చారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం

లక్కీడ్రా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ప్లాట్లను లాటరీ ద్వారా లబ్దిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గం లోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల 11లో

గనులశాఖలో అవినీతి మేట

- లెక్కకు మిక్కిలిగా జయరాజ్ ఆస్తులు
- రిమాండ్‌కు ఆదేశించిన ఎసిబి కోర్టు
- 14 రోజులు రిమాండ్‌కు వరంగల్ జైలుకు తరలింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, ఆగస్ట్ 28 : ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరు పర్చగా ఆదేశాలతో వరంగల్ జైలుకు తరలించారు. జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో 11లో

బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఆగస్ట్ 28 : ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం 11లో

చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ

- అదే కుటుంబానికి తగిలిన లక్కీడ్రా
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ప్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీయించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మీ) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి 11లో

అమెరికాలో తెలుగు యువతి హత్య

- ఆగ్రాలో నిందితుడి పట్టివేత
- అమెరికాకు అప్పగించనున్న పోలీసులు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఆగస్ట్ 28 : అమెరికాలో సంచలనం సృష్టించిన హైదరాబాద్ యువతి నిఖిత గోదిశాల (27) హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్య కేసు నిందితుడు, ఆమె మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ (26)ను హైదరాబాద్ పోలీసులు ఆగ్రాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. ఈ హత్య కేసులో భాగంగా ఇప్పటికే నిందితుడిపై అమెరికా పోలీసులు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో ప్రస్తుతం అమెరికా అధికారులకు అర్జున్ శర్మను అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోదిశాల అమెరికాలోని మేరీల్యాండ్‌లోని ఎల్లికాట్ సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె కనిపించడం లేదంటూ జనవరి 2న ఫిర్యాదు అందడంతో హోవర్డ్ కౌంటీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేరీల్యాండ్‌లోని అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. 11లో

బంగారు గని రాయదుర్గం భూమి

- 269 కోట్లకు ఎకరా పలికిన ధర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : రాయదుర్గం భూములు బంగారు గనిగా మారాయి. వేలంపై సుప్రీం తీర్పు తరవాత వాటికి బంగారాన్ని మించిన ధరలు పలుకుతున్నాయి. ఇలా హైదరాబాద్ ఐటీ కారిడార్ లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయ దుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం 11లో

పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

- నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి
- నేర నియంత్రణలో సాంకేతికతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని 11లో

బంగారం మైనింగ్‌లో హట్టి--సింగరేణి జతకడితే మెరుగైన ఫలితాలు

- భవిష్యత్ ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్‌గా కలిసి పనిచేసే అవకాశాలపై పరిశీలన.

- సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 28 : బంగారం మైనింగ్‌లో విశేష అనుభవం కలిగిన కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. కర్ణాటకలోని గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటీ బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధి ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు.

సాంకేతిక నైపుణ్యాల సమన్వయంతో ముందుకు:

హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి గోల్డ్ మైన్స్ అనుభవంతో అనుసంధానం చేయాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ వంటి అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలకం:

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయ పద్ధతుల్లో అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలని అన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

తవ్వకం నుంచి శుద్ధి వరకు పరిశీలన:

హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను భట్టి విక్రమార్క పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. అనంతరం 'యూటీ ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి.. బంగారం ముడి ఖనిజాన్ని వెలికితీసే విధానం, గని లోతు, ఖనిజ సేకరణ ప్రాంతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఆరా తీశారు. అనంతరం గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను పరిశీలించారు. యూటీ భూగర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను కూడా ఆయన పరిశీలించారు. ఖనిజ తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రితో మొక్కను నాటించారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూర్ జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరి సాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- భూపాలపల్లి రూరల్ మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- మహిళా సంఘాలు, అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఆగస్టు 28 : పేద ప్రజల సంక్షేమం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కమలాపూర్, గొల్లబుద్దారం, ఆజంనగర్, గూడాడ్‌పల్లి, నేరేడుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అర్హులకు అందించేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కమలాపూర్, ఆజంనగర్, నేరేడుపల్లి గ్రామాల్లో మహిళా సంఘాలకు సంబంధించిన వీఓ భవనాల నిర్మాణ పనులకు, పంబాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

వీఓ భవనాల నిర్మాణం పూర్తయితే మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేదల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి ఆర్డీవో, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

- బహుజన విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వాలు

- జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఆగస్టు 28 : రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని అన్నారు. మండలంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా బకాయిలను విడుదల చేయకపోవడం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో మొండివైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం రాష్ట్రంలో దీక్షలు చేయడం కంటే ఢిల్లీలో ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సుమారు రూ.1,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయించాలని సూచించారు. 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ నేతలు ధర్నాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. మూడు పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. బహుజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా అడ్డంకులు ఏర్పడుతున్నాయని, వారి విద్యా హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని యెర్రా కామేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన జేబీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేబీపీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, వినయ్, సోనూ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

2016-17 జేఎంఈటీల ప్రమోషన్లకు ఐఎన్‌టీయూసీ అండ

- బ్యాక్‌డేటెడ్ ప్రమోషన్లు ఇవ్వాలని గతంలోనే యాజమాన్యాన్ని కోరిన జనక్ ప్రసాద్

- కృతజ్ఞతలు తెలిపిన 2016-17 బ్యాచ్ జేఎంఈటీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, ఆగస్టు 28 :2016-17 బ్యాచ్ జేఎంఈటీలకు ప్రమోషన్లు త్వరితగతిన మంజూరు చేయాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ, మినిమం వేజ్‌బోర్డు సభ్యుడు డాక్టర్ జనక్ ప్రసాద్ సింగరేణి యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. ప్రమోషన్లు పొందడం జేఎంఈటీల హక్కు అని, వీలైనంత త్వరగా బ్యాక్‌డేటెడ్‌గా ప్రమోషన్ ఆర్డర్లు ఇవ్వాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26న రసూల్‌పల్లిలోని తన స్వగృహంలో జనక్ ప్రసాద్‌ను 2016-17 బ్యాచ్ జేఎంఈటీలు కలిసి తమ ప్రమోషన్ల సమస్యను వివరించారు. స్పందించిన జనక్ ప్రసాద్.. సింగరేణి డైరెక్టర్ (పా), జీఎం పర్సనల్ ఐఆర్‌పీఎం అధికారులతో మాట్లాడి ప్రమోషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. గతంలోనూ ఇదే అంశంపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సింగరేణి డైరెక్టర్ (పా)తో ఫోన్‌లో మాట్లాడి ప్రమోషన్ల సమస్యను పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆర్ఎల్‌సీ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేసిన కృషిని ప్రత్యక్షంగా అభినందించినప్పటికీ, తమ ప్రమోషన్ల కోసం డాక్టర్ జనక్ ప్రసాద్ చేసిన కృషి కూడా ఎంతో ఉందని 2016-17 బ్యాచ్ జేఎంఈటీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మైనింగ్ స్టాఫ్ భవిష్యత్ కార్యకలాపాలు, వారి హక్కుల సాధన కోసం ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని జనక్ ప్రసాద్ హామీ ఇచ్చారు. 2016-17 బ్యాచ్ జేఎంఈటీలకు అభినందనలు తెలిపిన ఆయన.. కంపెనీ నుంచి అధికారిక ప్రమోషన్ ఆర్డర్లు వెలువడే వరకు వారికి ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సింగరేణి కార్మికుల సమస్యలపై ఒప్పంద

- సమ్మె నోటీసుతో యాజామన్యం చర్చలు - పలు అంశాల పరిష్కారానికి దక్కిన హామీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కొత్తగూడెం, ఆగస్ట్ 28 : సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటం కీలక విజయాన్ని సాధించింది. ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు ప్రభావంతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చి కార్మికుల పలు ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించింది. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు జరిగిన చర్చల అనంతరం జరిగిన కీలక చర్చల్లో యాజమాన్యం పలు అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంది. అనంతరం కేంద్ర కార్మిక ప్రాంతీయ కమిషనర్ కార్యాలయంలో ఏఎల్‌సీ శాశ్వతిరెడ్డి సమక్షంలో యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు ఒప్పందాలు చేసుకున్నారు. 23 కీలక అంశాలపై అంగీకారం తెలిపారు. కోల్ ఇండియాలో అమలవుతున్న విధానానికి అనుగుణంగా కార్మికులకు లభించే అలవెన్సులు, పెర్క్స్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించేందుకు అంగీకరించింది. సర్వీసులో ఉండగానే సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు అందించే అంశానికి యాజమాన్యం అంగీకరించింది. కార్మికుల వైద్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నెలనెలా మెడికల్ బోర్డు నిర్వహించనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకుని చర్యలు చేపట్టనున్నారు. మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధనను తొలగించి, ఖాళీల ఆధారంగా ఒక సంవత్సరం నిబంధనతో ట్రాన్స్‌ఫర్లు చేపట్టేందుకు అంగీకరించారు. అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు సకాలంలో ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు కల్పించనున్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు కమిటీ ఏర్పాటు చేసి, అందులో యూనియన్ సంఘాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. దాదాపు 22 ఏళ్లుగా మార్పులేని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సవరించేందుకు అంగీకరించారు. సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీ సేవలతో పాటు వారం రోజుల వరకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టనున్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో అః÷ఇ సిలబస్ అమలుపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. గనుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిస్మిస్ కేసులను కమిటీ ద్వారా పరిష్కరించేందుకు అంగీకరించారు. మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్‌గ్రౌండ్ మైనింగ్ విభాగాల్లో జనరల్ అసిస్టెంట్లుగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిశీలించి అర్హతలకు అనుగుణంగా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వైద్య సదుపాయం అందేలా చర్యలు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అంగీకరించారు. ఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే ఈ కీలక నిర్ణయాలు సాధ్యమయ్యాయని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్, సహజ మరణానికి రూ.20 లక్షలు, మెడికల్ బోర్డు, లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ నిబంధనల మార్పు, ప్రమోషన్లు, వైద్య సదుపాయాలు, ఖాళీ పోస్టుల భర్తీ, డిపెండెంట్ ఉద్యోగాలు తదితర అంశాలపై సాధించిన అంగీకారాలు సింగరేణి కార్మికుల పోరాట చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, వై.వి.రావు, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లయ్య, ముస్కె సమ్మయ్య.. యాజమాన్యం తరఫున డైరెక్టర్ పా.గౌతం పోట్రూ, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన కుంజా కవిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఆగస్టు 28 : రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కుంజా భిక్షం కుమార్తె కుంజా కవిత శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రితో కుంజా కవిత ఆత్మీయంగా మాట్లాడారు.

దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో అన్వేషణ వేగవంతం చేయాలి

- సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 28 : సింగరేణి వేలంలో దక్కించుకున్న దేవదుర్గ బంగారం--రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు సమీపంలోనే దేవదుర్గ బ్లాక్ ఉండటం సింగరేణికి గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలోని గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం దేవదుర్గ బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. దేవదుర్గ బ్లాక్‌లో ఖనిజ నిక్షేపాల పరిమాణం, నాణ్యతను నిర్ధారించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్‌లో హట్టి గోల్డ్ మైన్స్‌కు ఉన్న సాంకేతిక అనుభవాన్ని దేవదుర్గ ప్రాజెక్టులో వినియోగించుకోవాలని తెలిపారు. అన్వేషణలో ఆశాజనక ఫలితాలు వచ్చిన వెంటనే చేపట్టాల్సిన తదుపరి దశలపై ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పురోగతికి అవసరమైన సాంకేతిక, పరిపాలనా చర్యలను సమన్వయంతో చేపట్టాలని అన్నారు. దేవదుర్గలో ఏర్పాటు చేయనున్న సింగరేణి సైట్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతిని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ పర్యటనలో సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూర్ జిల్లా పరిషత్ సభ్యుడు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరి సాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ జలాలను భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాలకు అందించాలి

- గోదావరి జలాలు అందక రైతుల్లో అసంతృప్తి

- సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా:

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఆగస్టు 28 : సీతారామ కెనాల్ ద్వారా భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాలకు గోదావరి జలాలను అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గోదావరి జలాలు అందక జిల్లాలోని రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. శుక్రవారం సీపీఐ, రైతు సంఘం నాయకులతో కలిసి జూలూరుపాడు మండలం వినోబానగర్ గ్రామ సమీపంలోని రాజీవ్ లింక్ కెనాల్‌ను కూనంనేని సందర్శించారు. అక్కడి అధికారులతో మాట్లాడి కాలువ ద్వారా నీటి సరఫరా, ప్రస్తుత పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను తరలించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే సీతారామ కెనాల్ నిర్మాణం కోసం భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల రైతులు తమ భూములను కోల్పోయారని, అలాంటి రైతులకు గోదావరి జలాలు అందకపోవడం బాధాకరమని అన్నారు. జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లోని చెరువులన్నింటికీ తక్షణమే సీతారామ జలాలను అందించాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాల రైతులకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఐ ఆధ్వర్యంలో లింక్ కెనాల్‌ను సందర్శించినట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

- కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఆగస్టు 28 : రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ హోమ్‌కు చెందిన బాలికలు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో పాటు అదనపు కలెక్టర్లు, జిల్లా సంక్షేమాధికారి, ఇతర అధికారులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్య, అభిరుచులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. బాలికలు కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, నాణ్యమైన విద్య అందించడం, తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'బేటీ బచావో--బేటీ పడావో' స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. 'బాలికను కాపాడుదాం.. బాలికను చదివిద్దాం.. బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం' అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ వేడుకల సందర్భంగా అధికారుల నుంచి లభించిన ఆప్యాయత, భరోసా బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. కార్యక్రమంలో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోషరూప, స్వాతి, ప్రియాంక, మౌనిక, దీప్తి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, బాలికలు పాల్గొన్నారు.

రాఖీ కట్టాల్సిన రోజే తమ్ముడికి కన్నీటి వీడ్కోలు

- మణుగూరులో విషాదం.. మృతిచెందిన సోదరుడికి రాఖీ కట్టిన అక్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, ఆగస్టు 28 : రక్షాబంధన్ పండుగ రోజున అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోదరుడి చేతికి రాఖీ కట్టాల్సిన అక్కకు విషాదమే మిగిలింది. మణు గూరులో గ్యాంగ్ ఘర్షణలో మృతిచెందిన యువకుడు సింహాద్రి శివకుమార్ (శివ)కు అతని అక్క పల్లవి రాఖీ కడుతూ కన్నీరుమున్నీరుగా విలపించిన దృశ్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. ప్రతి ఏడాది రక్షాబంధన్ సందర్భంగా సోదరుడి చేతికి రాఖీ కట్టి అతని క్షేమాన్ని కోరుకునే పల్లవి.. ఈసారి ప్రాణాలు కోల్పోయిన తమ్ముడి చేతికి రాఖీ కట్టాల్సిన పరిస్థితి ఎదురవడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాఖీ పండుగ రోజే సోదరుడికి తుది వీడ్కోలు పలుకుతూ ఆమె కన్నీరుపెట్టుకున్న తీరు అక్కడున్న వారిని కలచివేసింది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ రోజున చోటుచేసుకున్న ఈ విషాద ఘటన పలువురిని భావోద్వేగానికి గురిచేసింది.

24 డిమాండ్లపై సింగరేణితో ఒప్పందం

- సమ్మె నోటీసుతో యాజమాన్యం అంగీకారం
- కార్మికులకు పలు ఆర్థిక, హక్కుల ప్రయోజనాలు
- ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఆగస్టు 28 : సింగరేణిలో 24 డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, ఇది సింగరేణిలో చారిత్రాత్మక ఒప్పందమని పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యలపై 31 డిమాండ్లతో జూన్ 8న సమ్మె నోటీసు ఇచ్చామని, పలు దఫాల చర్చల అనంతరం 24 డిమాండ్లను యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. మిగిలిన డిమాండ్లను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ముఖ్యంగా అలవెన్సులపై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, దసరాలోపు లాభాల వాటా చెల్లింపు, బదిలీలకు సంబంధించిన మూడేళ్ల నిబంధన తొలగింపు, మైనింగ్ సిబ్బందికి ఓవర్‌మెన్ ప్రమోషన్లకు అంగీకారం లభించిందన్నారు. మారుపేర్ల సమస్య, విజిలెన్స్ కేసుల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడం, హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, రిటైర్డ్ కార్మికులకు ఇన్‌పేషెంట్ వైద్య సేవలు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్‌కు సానుకూలత, సకాలంలో సేఫ్టీ మెటీరియల్ పంపిణీ, డిస్మిస్డ్ కార్మికుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా ఒప్పందం కుదిరిందన్నారు. అలాగే మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్‌గ్రౌండ్ మైనింగ్ సిబ్బందికి సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం, పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల పరిష్కారం, ఉద్యోగులు ఈవెనింగ్ కాలేజీల్లో చదువుకునేందుకు ఎన్ఓసీ, ఖాళీ పోస్టుల భర్తీ, పెండింగ్‌లో ఉన్న 149 మంది డిపెండెంట్లకు త్వరలో ఆఫీస్ ఆర్డర్లు తదితర అంశాలను యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. గత 13 ఏళ్లుగా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో, ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైన అనంతరం స్ట్రక్చర్ సమావేశాల్లో నిరంతరం చర్చించామని, అయినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో సమ్మె నోటీసు ఇచ్చామని సీతారామయ్య, రాజ్‌కుమార్ తెలిపారు. తాజా ఒప్పందంతో కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు పలు హక్కులు సాధించామని, ఇందుకు సహకరించిన కార్మికులు, కార్మిక సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల సాధనతో పాటు సింగరేణి సంస్థ పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, శ్రీరాంపూర్ బ్రాంచి నాయకులు గునిగంటి నర్సింగరావు, నాయకులు పెద్దెల్లి శంకర్, పడాల కనకరాజు, ఎర్రగొల్ల చేరాలు, బూడిద మల్లేష్, కే.దేవయ్య, నూనె కొమురయ్య, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన డిసిసి అధ్యక్షురాలు సుగుణ

మంత్రి సీతక్కతో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఆగస్టు 28: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోదరులకు రాఖీ కట్టడం మన సంప్రదాయమని, సొంత అన్న కాకపోయినా సోదరుడిగా భావించే వారికి రక్షాబంధన్ కట్టడం ఆనవాయితీగా వస్తోందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి, కుమురం భీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆత్రం సుగుణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టినట్లు తెలియజేసి, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను జరుపుకున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క నివాసానికి వెళ్లిన సుగుణ మంత్రి సీతక్కతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క, సుగుణక్క ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఆత్మీయంగా రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.సీఎం సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తో పాటు మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ కు సుగుణరాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కొమురం భీం జిల్లా ప్రజలందరికీ రాఖీ పండుగ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

22ఏ భూముల సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి

- ప్రైవేట్ భూములు పొరపాటున నమోదైతే 48 గంటల్లో పరిష్కరించాలి - ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఆగస్టు 28 : 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీగా, పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. 22ఏ జాబితాలోని ప్రతి సర్వే నంబర్‌ను సంబంధిత రెవెన్యూ రికార్డులతో క్రాస్‌చెక్ చేసి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నిర్ధారించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ 22ఏ భూముల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే 22ఏ ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 22ఏ భూముల పరిశీలన, నమోదు, తొలగింపునకు ఒకే విధమైన సాధారణ ఫార్మాట్ రూపొందించాలని సూచించారు. 22ఏ నిషేధిత భూములను ఐదు కేటగిరీలుగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కేటగిరీలో అసైన్‌మెంట్, సీలింగ్ యాక్ట్, టెనెన్సీ యాక్ట్, ఆర్ఓఎఫ్ఆర్ తదితర రాష్ట్ర, కేంద్ర చట్టాల పరిధిలోని భూములు, రెండో కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములు, మూడో కేటగిరీలో ఎండోమెంట్, వక్ఫ్ భూములు, నాలుగో కేటగిరీలో సీలింగ్, అర్బన్ సీలింగ్ భూములు, ఐదో కేటగిరీలో ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఇతర భూములు ఉంటాయని వివరించారు. గతంలో రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే కొన్ని భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్యలు తలెత్తేవని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చట్టానికి సవరణలు తీసుకురావడంతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను నియంత్రిస్తున్నామని, సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో నిజమైన ప్రైవేట్ భూములు పొరపాటున 22ఏ జాబితాలో చేరే అవకాశం ఉందని, అలాంటి కేసులను రికార్డుల ఆధారంగా గుర్తించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన కేసుగా నిర్ధారణైన భూములను 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రభుత్వ భూములను కాజేయాలనే స్వార్థ ప్రయోజనాలతో కొందరు ప్రజల్లో భయాందోళనలు, అపోహలు సృష్టించి తమకు అనుకూలంగా భూములను 22ఏ నుంచి తొలగించుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీపడరాదన్నారు. 22ఏ జాబితాలోని ప్రతి భూమిని సర్వే నంబర్ వారీగా క్రాస్ వెరిఫై చేయాలని, ముందుగా ఆ సర్వే నంబర్ పాత 22ఏ జాబితాలో ఉందా లేదా పరిశీలించాలని సూచించారు. పాత జాబితాలో లేని సర్వే నంబర్ ప్రస్తుతం 22ఏలోకి ఎలా చేరిందో, కారణాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

తొలగింపునకు ప్రత్యేక విధానం:

ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. భూములను 22ఏలో చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని, తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని మండల తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- మహిళా సోదరీమణుల నుంచి రాఖీలు కట్టించుకున్న ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఆగస్టు 28 : భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నియోజకవర్గ, జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సోదరీమణులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో సంతోషం, ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. మహిళలు చూపిన ఆప్యాయతకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయత మరింత బలపడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ అధ్యక్షురాలు కడారి మాలతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పింగళి జ్యోతి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యురాలు, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల మంజూరుకు అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ పాండు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఆగస్టు 28 :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం--2026 కింద అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పాండు తెలిపారు.ఇందుకు సంబంధించిన పోస్టర్, బ్యానర్, కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఏ అదనపు పీడీ సూర్యారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత సామాజిక భద్రత పింఛన్లను అంది స్తోందన్నారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వితంతువులు 18 సంవత్సరాలు పైబడి భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. ఒంటరి మహిళలు 18 సంవత్సరాలు పైబడి భర్తతో విడిపోయి/వదిలివేయబడి కనీసం ఒక సంవత్సరం పూర్తయిన వారు అర్హులని, గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహితులు అర్హులని తెలిపారు. దివ్యాంగులకు వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉంటుంది. సదరన్/యుడిఐడి ధృవీకరణ ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉండాలి. (51 శాతం వినికిడి లోపం ఉన్నవారికి), రక్త సంబంధిత దివ్యాంగులు తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వ్యాధులతో బాధపడుతున్న వారు. సదరన్/యుడిఐడి ధృవీకరణ ఉండాలని తెలిపారు. కల్లుగీత కార్మికులు 50 సంవత్సరాలు పైబడి కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం ఉండాలని, ఎక్సైజ్ శాఖ ధృవీకరణ అవసరమని స్పష్టం చేసారు. చేనేత కార్మికులు 50 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని, చేనేత, జౌళి శాఖ ధృవీకరణ ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు గ్రేడ్-2, గ్రేడ్-3 ఫైలేరియా వ్యాధిగ్రస్తులు. అర్హులైన వారు సంబంధిత గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు/మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు/పురపాలక కమిషనర్లు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.అలాగే https://cheyutha.telangana.gov.in వెబ్‌సైట్‌లోని "Cheyutha Application Forms" బటన్ నొక్కి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు.అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకునే విధంగా మహిళా సమాఖ్యల సహకారంతో దరఖాస్తు ప్రక్రియ మరియు అవసరమైన ధృవపత్రాల విషయంలో సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హులైన వారు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు కోరారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్

- రౌడీషీటర్లు, పాత నేరస్తులు బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు...
- కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, అగస్ట్ 28 : కోరుట్ల పట్టణంలోని మనీబార్ అండ్ రెస్టారెంట్‌లో గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో క్యాషియర్‌పై దాడి చేసి, హత్యకు ప్రయత్నించిన బింగి అలియాస్ బంగి నగేష్ (24) ను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిందితుడు మనీబార్ బార్‌లో తనకు బీర్ ఇవ్వాలని క్యాషియర్‌ను దుర్భాషలాడగా, అతను ప్రశ్నించడంతో తన చేతికి ఉన్న స్టీల్ కడియంతో ముఖంపై దాడి చేసి గాయపరిచాడు. అనంతరం బీర్ బాటిల్‌తో తలపై కొట్టేందుకు ప్రయత్నించగా, బాధితుడు తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. బాధితుని ఫిర్యాదు మేరకు హత్య యత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్యామ్ రాజ్ తెలిపారు. నిందితుడి వద్ద నుండి దాడికి ఉపయోగించిన స్టీల్ కడియాన్ని స్వాధీనం చేసుకుని, అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయస్థానంలో హాజరుపరిచారు. నిందితుడిపై గతంలో పలు క్రిమినల్ కేసులు ఉండటంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎస్సై శ్యామ్ రాజ్ మాట్లాడుతూ..రౌడీషీటర్లు, నేరస్తులు, ప్రజలను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఇకపై చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, బెదిరింపులకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, అక్రమంగా మద్యం, ఇతర వస్తువులు తీసుకోవడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీషీటర్లు ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, చట్టప్రకారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపి, జైలుకు తరలించడం జరుగుతుందని, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

రీ-సర్వే డేటా ఎంట్రీలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వొద్దు : కలెక్టర్ దివాకర టీఎస్.

- ఫీల్డ్ స్థాయి సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలి
- ప్రతి వివరాన్ని పలుమార్లు క్రాస్‌చెక్ చేసిన తర్వాతే కన్ఫర్మ్ చేయాలి.
- రీ-సర్వే డేటా ఎంట్రీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఆగస్టు 28 : కూసుమంచి మండలం భగత్‌వీడు గ్రామంలో చేపడుతున్న రీ-సర్వేలో డేటా ఎంట్రీ ప్రక్రియను అత్యంత అప్రమత్తంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పలుమార్లు క్రాస్‌చెక్ చేసిన తర్వాతే డేటాను కన్ఫర్మ్ చేయాలని సూచించారు. భగత్‌వీడు గ్రామ రీ-సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ విధానంపై సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సంబంధిత సిబ్బందికి శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భగత్‌వీడు గ్రామంలోని మొత్తం భూములకు సంబంధించిన వివరాలను టీమ్‌ల వారీగా క్రమబద్ధంగా నమోదు చేయాలని తెలిపారు. ముందుగా ప్రీ-రీ-సర్వే డేటాను నమోదు చేసి, అనంతరం రీ-సర్వే డేటాను ఎంటర్ చేయాలని సూచించారు. రెండు దశల డేటాను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ లాగిన్‌ను కేవలం డేటా నమోదు కోసమే వినియోగించాలని, ఫ్రీజింగ్, కన్ఫర్మేషన్ ఆప్షన్లు తహసీల్దార్ లాగిన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

ముందుగానే ప్రభుత్వ భూముల వివరాల నిర్ధారణ:

రీ-సర్వే ప్రారంభానికి ముందే గ్రామ సరిహద్దులు, గ్రామ విస్తీర్ణం, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ భూముల వివరాలను పక్కాగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్అండ్‌బీ రోడ్లు, పీఆర్ రోడ్లు, అటవీ భూములు, వక్ఫ్, ఎండోమెంట్ భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూముల వివరాలను ముందుగానే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాలను రీ-సర్వే డేటా ఎంట్రీకి ముందే సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రీ-సర్వే అనంతరం లభించిన సమాచారాన్ని కూడా అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. పట్టాదారు పాస్‌బుక్ (పీపీబీ) ఉన్న ఆక్యుపెన్సీ, పీపీబీ లేని ఆక్యుపెన్సీ వివరాలను విడివిడిగా నమోదు చేయాలని సూచించారు. రీ-సర్వే అనంతరం ప్రభుత్వ భూమి విస్తీర్ణంలో మార్పు గుర్తించినట్లయితే నిబంధనల ప్రకారం అవసరమైన సవరణలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఒక్క పొరపాటుతో భవిష్యత్‌లో తీవ్ర సమస్యలు:

డేటా ఎంట్రీలో ఒక్క తప్పు నమోదు జరిగినా భవిష్యత్‌లో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి వివరాన్ని కనీసం పలుమార్లు క్రాస్‌చెక్ చేసిన తర్వాతే కన్ఫర్మ్ చేయాలని సూచించారు. ఎకరాలు, గుంటల వివరాలను నమోదు చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, గుంటల కొలత 40కి మించకుండా చూడాలని తెలిపారు. 40 గుంటలకు మించిన కొలతను తదుపరి ఎకరాగా పరిగణించే విధంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తికావడంలో డేటా ఎంట్రీ కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఫీల్డ్‌లో గుర్తించిన సమస్యలు, వ్యత్యాసాలు, సందేహాలను తప్పనిసరిగా రికార్డు చేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యలను పరిష్కరించిన అనంతరం మాత్రమే డేటాను నిర్ధారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ ఖాజా మొహిద్దీన్, ప్రధాన సర్వేయర్ మురళి, మండల సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గ్రామపంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, అగస్ట్ 28 : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని సంజయ్ సోదరి డా.సమత శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డా.సంజయ్ నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే సంజయ్ కోరుకున్నారు.

మీడియాపై దాడి.. కోదాడలో కలకలం

- జర్నలిస్ట్ సురేష్‌పై ఘటనకు సీఐ శివశంకర్ వివరణ ఇవ్వాలి
- గణేష్ ఫిర్యాదుపై స్పందన ఏది... ఉన్నతాధికారుల మౌనంపై ప్రశ్నలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ, ఆగస్టు 28 : కోదాడలో జర్నలిస్ట్ సురేష్‌పై జరిగిన ఘటనపై జర్నలిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాడి ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు కనిపిస్తోందని, దీనిపై సీఐ శివశంకర్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం జర్నలిస్ట్ గణేష్‌పై మేకపోతుల సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై కూడా స్పందన లేకపోవడాన్ని ప్రశ్నించారు. మీడియాపైనే ఇలాంటి ఘటనలు జరుగుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు !

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి దంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లా డరు. తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయ కత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్ లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేము న్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లుల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునా రిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకం గా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని,అడవులను పట్టించుకుని ఉం టే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్య మైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరష్కరించారో చెప్ప లేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మ డి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృ తిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ, చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుం ది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యిం ది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతు న్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్‌స్‌ను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగిం ది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజు వయ్యింది. బిఆర్ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భార తీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీ ఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నా యం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మ కాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రుల దీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరి వల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

అణు బాంబు నీడలో మానవ జీవితం

అణు వ్యతిరేక ఉద్యమం అనివార్యం

ఆగస్టు 29... అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం

రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రపంచ చరిత్రలో అణుశక్తి మానవ మేధస్సు ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచి నప్పటికీ, అదే శక్తి మానవ నాగరికతను నాశనం చేసే భయంకర శక్తిగా కూడా పరిణమించింది.

ప్రపంచ శాంతి, మానవ రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలు నేటి యుగంలో అత్యంత ప్రాధాన్యం సంత రించుకున్నాయి. అణు ఆయుధాలు మానవజాతికి శక్తి, ఆధిపత్యం, సాంకేతిక ప్రగతి యొక్క చిహ్నాలుగా భావించ బడినా వాటి విధ్వంసకర శక్తి ప్రపంచాన్ని పునరా వృతంగా ఆలోచించేలా చేస్తోంది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 29న అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం జరుపు కుం టారు. 1991లో కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ అణు పరీక్షా క్షేత్రం మూతపడిన రోజు గుర్తింపుగా ఐక్యరాజ్య సమితి 2009 డిసెంబర్ 2న తీర్మానం ఆమోదించి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ నిర్ణయం అణు పరీక్షలు మానవ జాతిపై మోపిన విపరీతమైన దుష్పరిణామాలను స్మరింప జేయడమే కాక భవిష్యత్తులో అణు ముప్పులను నివారించే ప్రయత్నాలకు ఒక బలమైన ఆహ్వానం.

ప్రపంచ చరిత్రలో అణు పరీక్షల మొదటి దృశ్యం 1945 జూలై 16న అమెరికా న్యూ మెక్సికోలోని అలమోగోర్డోలో "ట్రినిటీ" పేరిట జరిగిన ప్రయోగమే. తరువాత అదే సంవత్సరం జపాన్‌పై హిరోషిమా, నాగసాకిపై అణు బాంబులు ప్రయోగించ బడినప్పుడు ప్రపంచం అణు శక్తి యొక్క భయానకతను ప్రత్యక్షంగా చూచింది. ఆ ఘోర వినాశనం లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నదే కాక తరతరాల పాటు ఆ ప్రాంతాల్లో వికలాంగత్వం, కేన్సర్లు, పర్యావరణ కాలుష్యం వంటి అపరిమిత కష్టాలను మిగిల్చింది. ఆ తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా తదితర దేశాలు యుద్ధ కాలంలో ఆధిపత్య పోరులో భాగంగా వందలాది అణు పరీక్షలు జరిపాయి. ఈ పరీక్షలు కేవలం ఎడారులు, సముద్రాలు, భూమి గర్భానికే పరిమితం కాలేదు; వాటి ప్రభావం వాతావరణంలో రేడియోధార్మిక కణాలుగా వ్యాప్తి చెంది మానవ ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 2,000కి పైగా అణుపరీక్షలు జరిగాయి. వీటిలో అమెరికా 1,030, సోవియట్ యూనియన్ 715, ఫ్రాన్స్ 210, బ్రిటన్ 45, చైనా 45, భారత్ 6, పాకిస్తాన్ 6, ఉత్తర కొరియా 6 పరీక్షలు జరిపాయి. ప్రతి పరీక్ష వాతావరణంలో విష రసాయనాలు, రేడియేషన్ విడుదల చేస్తూ జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేసింది.

సంవత్సరాలుగా అణు పరీక్షల వ్యతిరేకంగా ప్రజల నిరసనలు ఉధృతమయ్యాయి. జపాన్‌లో అణుబాంబు బాధితులు, శాంతి కార్యకర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపారు. ఈ నేపథ్యంలో 1963లో అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు "పాక్షిక అణు పరీక్షా నిషేధ ఒప్పందం"పై సంతకం చేసి భూమి మీద, వాతావరణంలో, నీటిలో పరీక్షలను నిషేధించాయి. అయితే భూగర్భ పరీక్షలకు మాత్రం అవకాశం ఇచ్చారు. తదనంతరం 1996లో సమగ్ర అణు పరీక్షా నిషేధ ఒప్పందం (జుదీ) రూపొందినా అది అమల్లోకి రాలేదు, ఎందుకంటే అణు శక్తివంతమైన కొన్ని దేశాలు దానిని అనుమోదించలేదు. అయినప్పటికీ, ఆ ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో అణు నియంత్రణకు ఒక ప్రధాన పునాది వేసింది. భారతదేశం 1974లో "స్మైలింగ్ బుద్ధా" పేరిట మొదటి అణుపరీక్ష, 1998లో పోఖ్రాన్-×× పేరిట ఐదు అణుపరీక్షలు నిర్వహించింది. అయితే భారత్ ఎల్లప్పుడూ "ప్రథమంగా అణ్వస్త్ర వినియోగం చేయమని" (చీశీ ఖీఱతీర్ ఖంవ ౣశీశ్రీఱఎఎ) స్పష్టంగా ప్రకటించింది. ఈ విధానం ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది.

అణు పరీక్షల ప్రభావం మానవ జీవితంలో అనేక కోణాలలో ప్రతిఫలించింది. భూగర్భ పరీక్షల వల్ల భూకంపాలు, భూగర్భ జలాల కలుషితం, నేల పాడైపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సముద్ర పరీక్షలు సముద్ర జీవ సంపదపై ఘోర ప్రభావం చూపాయి. వాతావరణంలో వ్యాపించిన రేడియోధార్మిక కణాలు ఆహార శ్రేణిలోకి చేరి తరతరాల పాటు జన్యు వ్యాధులను సృష్టించాయి. వైద్యపరమైన పరిశోధనల ప్రకారం అణు పరీక్షల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలలో కేన్సర్, ల్యూకేమియా, థైరాయిడ్ వ్యాధులు అధికంగా కనిపించాయి. కజాఖ్‌స్తాన్ లోని సెమిపాలటిన్స్క్ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రం లోని బికినీ అటోల్ దీవులు, నెవాడా ఎడారి లాంటి ప్రాంతాలు ఈ విషాదానికి సాక్ష్యాలుగా నిలిచాయి.

అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం నేడు మనిషి అనుభవించిన దుర్ఘటనల జ్ఞాపకమే కాక భవిష్యత్తు పట్ల మానవజాతికి

ఒక హెచ్చరిక. ఈ రోజు దేశాలు పరస్పరం నమ్మకం పెంపొందించుకొని, ఆయుధ పోటీకి బదులుగా శాంతి సహకారం వైపు నడవాలని గుర్తు చేస్తుంది. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ శాంతి సంస్థలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం అన్ని వర్గాలు ఈ రోజు నాడు అణు పరీక్షల ముప్పును సవివరంగా చర్చించి ప్రత్యామ్నాయ భద్రతా మార్గాలను అన్వేషిస్తాయి. అణు నిరాయుధీకరణ దిశగా వియన్నా, జెనీవా వంటి నగరాల్లో అనేక చర్చలు జరుగుతాయి. ఇది కేవలం ప్రభుత్వాలకే కాక సాధారణ పౌరులకూ శాంతి పట్ల బాధ్యతను గుర్తు చేసే రోజు. అణు శక్తి శాంతి ప్రయోజనాల కోసం ఉపయోగపడే శక్తివంతమైన సాధనం కావచ్చు. విద్యుత్ ఉత్పత్తి, వైద్యరంగం, వ్యవసాయం వంటి రంగాల్లో అది సద్వినియోగం అవుతుంది. కానీ దాన్ని ఆయుధాలుగా వినియోగించడం మానవ జాతికి అస్తిత్వపరమైన ముప్పు. అందుకే అంతర్జాతీయ సమాజం అణు నిరాయుధీకరణ పట్ల కట్టుబాటుగా ఉండి అణు పరీక్షలు జరప కుండా నిబద్ధతతో ముందుకు సాగాలి. ఆగస్టు 29 మనకు చేసే బోధ ఇదే. భవిష్యత్తు తరాలకు ఒక సురక్షితమైన, శాంతి యుతమైన ప్రపంచాన్ని అందించాలంటే అణు ఆయుధాల రహిత భూగోళాన్ని సాధించడానికి ప్రయత్నాలు ఆగ కూడదు. మానవ జీవన విలువను కాపాడటం, ప్రకృతి సమతుల్యతను పరిరక్షించడం, శాంతిని నిలబెట్టడం అనే మూడు లక్ష్యాల కోసం ఈ రోజు మానవ జాతి ఒకటిగా నిలబడి ఆత్మ పరిశీలన చేయాలి. ఈ విధంగా అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం చరిత్రను మాత్రమే కాదు, వర్తమానం, భవిష్యత్తును కూడా ఆలోచింపజేసే సందర్భం. ఇది కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, మానవజాతి తన దారిని శాంతి,సహజీవనం వైపు మళ్లిం చుకోవాల్సిన సమయం అని గుర్తు చేసే అంతర్జాతీయ పిలుపు.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

తండాల అభివృద్ధే ధ్యేయం... గిరిజనుల సంక్షేమమే లక్ష్యం...

ప్రతి గిరిజన కుటుంబానికి ఇల్లు... ప్రతి తండాకు రోడ్డు
సాగునీరు, హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు కృషి
ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి (పెద్దమందడి) ఆగస్టు 28 : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి గిరిజనుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గిరిజనులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గిరిజనులు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని, వారి హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండి పోరాడిందని పేర్కొన్నారు.

ప్రతి గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

నియోజకవర్గంలోని ప్రతి తండాలో ఇల్లు లేని గిరిజన కుటుంబాలను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని మేఘారెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క పేద కుటుంబం కూడా సొంతింటికి దూరం కాకుండా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

32 తండాల్లో సేవాలాల్ ఆలయాలు

వనపర్తి నియోజకవర్గ పరిధిలోని 32 తండా గ్రామపంచాయతీల్లో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు. గిరిజనుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి తండాకు రోడ్డు... సాగునీరు...

ప్రతి తండాకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని మేఘారెడ్డి అన్నారు. తండాల నుంచి మండల, నియోజకవర్గ కేంద్రాలకు రాకపోకలు సులభతరం అయ్యేలా రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి గిరిజన గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తామన్నారు. తండాల్లో తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. గిరిజన రైతులు సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా అన్ని తండాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల భూములకు నీరు అందితేనే గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

కర్నేతండా లిఫ్ట్‌కు సేవాలాల్ పేరు

కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ ప్రాజెక్ట్‌గా నామకరణం చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు.

పోడు భూముల సమస్యపై కృషి

గిరిజనుల పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గిరిజన రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తండాల్లోనే వైద్య సేవలు

గిరిజన తండాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి తండాకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామని, గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం

గ్రామాల అభివృద్ధి కోసం పనిచేసిన పాత, కొత్త సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

రూ.2 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు, రైతులు, మహిళలు, యువత, గిరిజనులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని మేఘారెడ్డి తెలిపారు. రైతు భరోసా, మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ. 2,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, మౌలిక వసతులు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో పెద్దఎత్తున పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

24 గంటలు ప్రజల కోసం పనిచేస్తా

నియోజకవర్గ అభివృద్ధి కోసం 24 గంటలు పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మేఘారెడ్డి అన్నారు. పదవిని ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని, ప్రతి గ్రామం, ప్రతి తండా అభివృద్ధి చెందే వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. "ప్రతి తండా అభివృద్ధి చెందాలి.. ప్రతి గిరిజన కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలి.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలి.. ప్రతి రైతు భూమికి సాగునీరు అందాలి.. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.. ఇదే నా సంకల్పం" అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగంపల్లి సర్పంచ్ రమేష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాల్యానాయక్, దిశా కమిటీ సభ్యుడు రవి నాయక్, జిల్లా కాంగ్రెస్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, అనకాపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయక్, కోతులకుంట తండా సర్పంచ్ పాండు నాయక్, వనపర్తి మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, ఎంపీటీసీ నాగరాజు నాయక్‌తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గిరిజన పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రీ-సర్వేను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఆగష్టు 28 : జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ--సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులకు (జిపిఓలు) గ్రామాల రీ-సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రీ--సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ కమతాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా కొలిచి, భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించడమే రీ--సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రీ-సర్వే ప్రారంభానికి ముందు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, భూ యజమానులు, పట్టాదారులు, రైతులు, ప్రజాప్రతినిధులకు సర్వే కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, కుంటలు, వాగులు, రహదారులు, శ్మశానవాటికలు, ప్రజా అవసరాలకు కేటాయించిన భూములు తదితర సామూహిక ఆస్తులను స్పష్టంగా గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో రెవెన్యూ రికార్డులు, పాత గ్రామ పటాలు, సేత్వార్, టిప్పన్, ఖాస్రా పహాణి, ప్రస్తుత భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు మరియు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. పాత సర్వే నంబర్లు, కొత్త భూ కమతాల మధ్య సంబంధాన్ని తెలియజేసే కోరిలేషన్ స్టేట్‌మెంట్, ఫీల్డ్ రిజిస్టర్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్, గ్రామ పటం తదితర రికార్డులను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రూపొందించాలని సూచించారు. భూ కమతాల కొలతలు పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలో హద్దులను నిర్ధారించాలని తెలిపారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చినప్పుడు వాటిని నిర్ణీత గడువులో స్వీకరించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిష్పక్షపాతంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ పాలనాధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, సర్వే బృందాలకు అవసరమైన భూ రికార్డులు, స్థానిక సమాచారం అందించాలని సూచించారు. గిర్దావర్లు రోజువారీ సర్వే పనులను పర్యవేక్షించాలని, తహసీల్దార్లు మండల స్థాయిలో మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. రీ-సర్వే అనేది కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, గ్రామంలోని ప్రతి అంగుళం భూమికి సంబంధించిన సమగ్రమైన, శాశ్వతమైన మరియు విశ్వసనీయమైన రికార్డును రూపొందించే కీలక కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి రీ--సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో రీ--సర్వేకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ కమతాల కొలత, మ్యాపుల తయారీ, రికార్డుల పరిశీలన, ఫారాలు--రిజిస్టర్ల నిర్వహణ, అభ్యంతరాల పరిష్కారం, తుది భూ రికార్డుల రూపకల్పన తదితర అంశాలను అధికారులకు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బి.ఎస్. లత అడిషనల్ కలెక్టర్ (రె) , ఫారెస్ట్ , ఆర్ ౘ బి, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ జిల్లా అధికారులు , రెవెన్యూ మరియు సర్వే--ల్యాండ్ రికార్డుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- భీమవరంలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం
- గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఆగస్టు 28 : ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం నత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. వేంసూరు మండలం భీమవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం భవనాన్ని పరిశీలించి, గ్రామ ప్రజలకు పంచాయతీ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా పంచాయతీ కార్యాలయం పనిచేయాలని అన్నారు. అనంతరం సత్తుపల్లి పట్టణంలోని కొమ్మేపల్లి కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులను అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని, సొంతింటి కలను నెరవేరుస్తోందని పేర్కొన్నారు. తదుపరి అంబేద్కర్‌నగర్‌లో సాయి శ్రీనివాస్ కుమార్తె వివాహ సందర్భంగా నిర్వహించిన పెళ్లికూతురు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే.. నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా క్రీడా పోటీలు ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ క్రీడా వారోత్సవాలు--2026 సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నేడు స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయడం, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ మాట్లాడుతూ, క్రీడలు యువత వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, సహనశీలతతో పాటు జట్టు భావన కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అక్బర్ అలీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, సదుపాయాలు అందించేందుకు యువజన మరియు క్రీడల శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. జాతీయ క్రీడా వారోత్సవాల్లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. ఈ సందర్భంగా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డి. ఇమామ్ కరీం మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. క్రీడల ద్వారా యువతకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా చిన్న వయస్సు నుంచే విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శంభు లింగం, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, కోచ్‌లు యావార్, పవన్ తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ క్రీడలకు చెందిన క్రీడాకారులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా మైదానం యువ క్రీడాకారుల సందడితో కళకళలాడింది. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్, మరో కార్పొరేటర్ ఖలీల్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అక్బర్ అలీ, హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఇమామ్ కరీం, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శంభు లింగం, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, కోచ్‌లు యావార్, పవన్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు జిల్లాలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసి, యువ క్రీడాకారులకు కొత్త అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మాజీ మంత్రి కోట్నాక భీంరావు వర్ధంతిని విజయవంతం చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఆగస్టు 28 : మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, దివంగత కోట్నాక భీంరావు వర్ధంతిని జయప్రదం చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా సర్పంచి కురిసింగ మోతీరామ్, జాతీయ నాయకుడు అర్క మాస్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29(శనివారం)న జిల్లా కేంద్రంలోని కొట్నాక భీమ్రావు(చిల్డ్రన్) పార్కులో వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఆదివాసీలు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి భీంరావు చేసిన సేవలను స్మరించుకోనున్నారు. గిరిజన విద్యాభివృద్ధికి ఆశ్రమ, గురుకుల, ప్రాథమిక పాఠశాలల స్థాపనతో పాటు సాంప్రదాయ రాయి సెంటర్ వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక జీవోల ద్వారా ఐటీడీఏ పరిధిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేసి ఎంతోమంది ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.కోట్నాక భీంరావు సేవలను స్మరించుకునే ఈ కార్యక్రమంలో ఆయన కుమార్తెలు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మర్సుకోల సరస్వతితో పాటు అభిమానులు, ప్రజలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి, నర్సింగరావు, జ్ఞానేశ్వర్, బాదిరావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- చేయూత పింఛన్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలి
- చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పోస్టర్ ఆవిష్కరణ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఆగస్టు 28 : అర్హులైన ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. శుక్రవారం, సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చేయూత పింఛన్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ఫ్లెక్సీలు, కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రజలకు అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, చివరి తేదీపై అవగాహన కల్పించాలని సూచించారు. చేయూత పింఛన్ల దరఖాస్తు ఫారాలను చేయూత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అలాగే నింపిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మహిళా సమాఖ్యలు చేయూత సామాజిక భద్రతా పింఛన్ల అమలులో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి వితంతువు, ఒంటరి మహిళను గుర్తించి, పింఛన్ దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని తెలిపారు. దరఖాస్తుల నింపడం, అవసరమైన ధ్రువపత్రాల సేకరణ, సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తుల సమర్పణ వరకు మహిళా సమాఖ్య సభ్యులు వారికి అండగా నిలవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మొదటి విడతలో సుమారు 7,500 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఇంకా అర్హత కలిగిన వారు చివరి తేదీ వరకు అవకాశాన్ని వినియోగించుకొని, దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పింఛను రకాలు - అర్హతా ప్రమాణాలు గురించి వివరించారు. వితంతువులు: 18 సం.లు పైబడిన వారు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు: వివాహితులు: 18 సం.లు పైబడిన వారు, భర్తతో విడిపోయి/వదిలివేయబడి 1 సం.లు పైబడిన వారు, అవివాహితులు: గ్రామీణ ప్రాంతాల్లో 30 సం.లు పైబడిన వారు; పట్టణ ప్రాంతాల్లో 35 సం.లు పైబడిన వారు, దివ్యాంగులు: వయసుతో సంబంధం లేదు సదరన్/యుడిఐడి ధృవీకరణ ద్వారా 40% వైకల్యం (వినికిడి లోపం ఉన్నవారికి 51%), రక్త సంబంధిత దివ్యాంగులు: తలసేమియా, సికిల్ సెల్ డిసీస్, హీమోఫీలియా (సదరన్/యుడిఐడి ధృవీకరణ), కల్లుగీత కార్మికులు: 50 సం.లు పైబడిన వారు, కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం ఎక్సైజ్ శాఖ ధృవీకరణ, చేనేత కార్మికులు: 50 సం.లు పైబడిన వారు చేనేత & జౌళి శాఖ ధృవీకరణ, ఫైలేరియా బాధితులు: గ్రేడ్-2 & 3 ఫైలేరియా వ్యాధిగ్రస్తులు అర్హులని తెలిపారు. కాగా దరఖాస్తుల స్వీకరణ గ్రామీణ ప్రాంతాలలోపంచాయతీకార్యదర్శులు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పట్టణప్రాంతాలలోవార్డు అధికారులు,పురపాలక కమీషనర్లకు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను https://cheyutha.telangana.gov.in వెబ్‌సైట్‌లోని "cheyutha application formsu" బటన్ నొక్కి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నూరుద్దీన్, డీపీఎం సతీష్, అడ్మిన్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు పాల్వంచలో జిల్లా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీలు

- ముఖ్య అతిథిగా ఎస్పీ రోహిత్‌రాజ్.. 9 వెయిట్ కేటగిరీల్లో పోటీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఆగస్టు 28 : పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో యూనిటీ గోల్డ్ జిమ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న పాల్వంచ ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా స్థాయి ఎంటరేజ్‌వెంట్ బెంచ్‌ప్రెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.డి. నూర్, ఎం.డి. జాకీర్, ఎం.డి. అమీర్‌ఖాన్, ఎస్.కె. సల్మాన్ తెలిపారు. పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పాల్వంచలో నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. జిల్లాలోని పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు పాల్వంచలో తొలిసారిగా జిల్లా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో మొత్తం 9 వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలోని జిమ్ నిర్వాహకులు, క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డును వెంట తీసుకుని ఉదయం 8 గంటలలోపు ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్‌కు చేరుకోవాలని కోరారు. పోటీలను విజయవంతం చేసేందుకు క్రీడాకారులు, జిమ్ నిర్వాహకులు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

నీట్ -పీజీ 2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

- ఖమ్మం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు.. 668 మంది విద్యార్థులు హాజరు
- ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఆగస్టు 28 : ఖమ్మం జిల్లాలో ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్--పీజీ 2026 పరీక్షను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, నిబంధనలను వెల్లడించారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని అయాన్ డిజిటల్ జోన్, లక్ష్య కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒక కేంద్రం, ఖమ్మంలోని పాకబండ బజార్‌లోని స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేంద్రాల్లో మొత్తం 668 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

వైద్య సదుపాయాలు, పోలీస్ బందోబస్తు:

పరీక్షా కేంద్రాల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

విద్యార్థులు నిబంధనలు తప్పక పాటించాలి:

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతిస్తామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులు తప్పనిసరిగా కలర్ ప్రింట్‌అవుట్ అడ్మిట్ కార్డుతో పాటు ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఎంబీబీఎస్ పర్మనెంట్/ప్రొవిజనల్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలర్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్ అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

సుభాష్ కాలనీలో ఘనంగా జంధ్యాధారణ, రక్షాబంధన్ వేడుకలు

పద్మశాలీల ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఆగస్టు 28 : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీ రామాలయంలో ఆదర్శ పద్మశాలి సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జంధ్యాధారణ, రక్షాబంధన్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కొండ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం పద్మశాలీల ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. ముందుగా శ్రీ మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ సుమారు 50 మంది పద్మశాలీలు నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. అనంతరం పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మశాలి కులబాంధవులంతా ఐక్యంగా ఉంటూ సమాజ అభివృద్ధికి, సంఘ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి సేవా కార్యక్రమంలో సభ్యులందరూ చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గోరంట్ల విక్రమ్‌సేన్, ఉపాధ్యక్షులు చీకటి తిరుపతి, గుండేటి రమేష్, గౌరవ సలహాదారులు ఎలగొండ రాజేంద్రప్రసాద్, భీమనాథుని సత్యనారాయణ, కొట్ల అశోక్‌కుమార్, భూర్ల రమేష్, మామిడాల లక్ష్మణ్, కోశాధికారి కూచన కిషన్ ప్రసాద్‌తో పాటు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గూడెం వారింట రాఖీ పండుగ వేడుకలు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి రాఖీలు కట్టి

- శుభాకాంక్షలు తెలియజేసిన సోదరిమణులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు, ఆగస్టు 28 : సోదరి సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సంబరాలు గూడెం వారి ఇంట వెల్లి విరిశాయి. రాఖీ పండుగ పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నివాసానికి చేరుకున్న వారి సోదరి మణులు నర్సమ్మ, సువర్ణలు ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు మరో సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిలకు రాఖీలు కట్టి తమ అనుబం ధాన్ని చాటుకున్నారు. వీరితోపాటు గూడెం మహిపాల్ రెడ్డి కుమార్తె కొలన్ రాజేశ్వరి రెడ్డి తమ సోదరుడు గూడెం విక్రం రెడ్డికి రాఖీ కట్టారు. కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి కుమార్తె రుధిర, గూడెం విక్రం రెడ్డి కుమార్తె మహిరలు వారి సోదరులు అక్షయ్ రెడ్డి, నిహాన్ రెడ్డి లకు రాఖీలు కట్టారు. కుటుంబమంతా రాఖీ పండుగ సంబరా లు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ అక్కా చెల్లెలు, అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాల సూచికగా నిర్వహించుకుని గొప్ప పండుగ రాఖీ అని అన్నారు. నియోజకవర్గం లోని ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

తుర్కపల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 27 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు కేదాస్ మోహన్ మాదిగ పిలుపుతో తుర్కపల్లి మండలంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మీసాల ఉప్పలయ్య మాదిగ హాజరయ్యారు. సమావేశం అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోట చరణ్ తేజ, ఉపాధ్యక్షుడిగా కోట లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా కోట పవన్ కుమార్, కోశాధికారిగా గడ్డమీది విఘ్నేష్, కార్యదర్శిగా గడ్డమీది వంశీలను నియమించారు. కార్య వర్గ సభ్యులుగా కోట ధనుష్, బండారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆశయాల సాధనకు, సంఘం బలోపే తానికి నూతన కమిటీ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

సింగన్నగూడెం చౌరస్తాలో అండర్‌పాస్... టెండర్ పూర్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 27 : భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం చౌరస్తా వద్ద నిర్మించనున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని ఈ సందర్భంగా శుక్రవారం చౌరస్తా వద్ద అండర్‌పాస్ నిర్మించనున్న ప్రాంతాన్ని భువన గిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి స్థానిక నాయకులతో చర్చించారు. అండర్‌పాస్ నిర్మాణంతో చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేశ్, గ్రంథాల య చైర్మన్ అవైజ్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, స్థానిక కౌన్సిలర్ బొంతల నర్సింగ్‌రావు, మాజీ కౌన్సిలర్ ఈరపక నరసింహ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పల్లెల్లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఆగస్టు 28 : రామగుండం పట్టణం అంతర్గాం పాలకుర్తి మండలాల్లోని పల్లెల్లో శుక్రవారం అన్నాచెల్లెళ్ల అనురాగ బంధానికి ప్రతీక రాఖీ పండగ వేడుకలను అనవర్గాల ప్రజలు నిర్వహించుకున్నారు. అత్తవారి ఇంటి నుంచి పుట్టిన గ్రామానికి పెరిగిన ఇంటికి కుటుంబ సపరివారంగా ఆడబిడ్డలు రావడంతో ప్రతి ఇంటిలో రాఖీ పండగ సందడి చేసింది ఉదయం నుంచి సాయంకాలం వరకు ప్రయాణంతో ప్రయాణికులతో వాహనాలు కిటకిట లాడాయి. అక్కలు చెల్లెల్లు అన్నలు తమ్ముళ్లు వదినలు మరదండ్లకు రాఖీలు కట్టి స్వీట్లతో అనురాగాన్ని అనుబం ధాన్ని పంచారు రాఖీ పౌర్ణమి సందర్భంగా విందులు వినోదాలతో రాఖీ పండుగ పర్వదినం అందరిలోఅను రాగన్నిఅను బంధాన్ని నింపింది.

మక్తల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, ఆగష్టు 28 : మక్తల్ పట్టణంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మక్తల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానసా హనుమంతు, జిల్లా కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ

మతాలకు అతీతంగా వెల్లివిరిసిన సోదర భావం..

- 20 ఏళ్లుగా రాఖీ కడుతున్న ముస్లిం మహిళ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, అగస్ట్ 28 : ఐసిడిఎస్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ముస్లిం (దూదేకుల) మతానికి చెందిన హైమది బేగం కోరుట్లలోని తమ ఇంట్లో గతంలో అద్దెకు నివసించిన ఓ హిందూ కుటుంబానికి చెందిన వారికి గత 20 సంవత్సరాలుగా రాఖీ కడుతూ, మతాలకు అతీతంగా సోదర భావాన్ని చాటుతున్నారు. శుక్రవారం రాఖీ పండుగ సందర్భంగా మాజీ బిజెపి పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్ కుటుంబ సభ్యులకు హైమది బేగం రాఖీ కట్టి వారితో ఆనందాన్ని పంచుకుంది.

రాఖీ కట్టారు.. పెద్దన్నగా అండగా ఉంటానన్నాడు!

మహిళలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి భరోసా.. రాఖీ కట్టిన వారికి చీరల బహూకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో అన్నాచెల్లెళ్ల అనుబంధం ఆత్మీయతను పంచింది. నియోజకవర్గంలోని మహిళలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలిపారు. మహిళలు రాఖీలు కట్టగా ఎమ్మెల్యే మేఘారెడ్డి వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాఖీ కట్టిన మహిళలందరికీ చీరలను బహూకరించారు. ఈ సందర్భంగా మహిళలతో తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. “మీరు నన్ను అన్నగా భావించి రాఖీ కట్టారు.. ఇక నుంచి మీకు పెద్దన్నగా అండగా ఉంటా. ఏ సమస్య వచ్చినా సంకోచించకుండా నా దృష్టికి తీసుకురండి. పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా” అని మేఘారెడ్డి భరోసా ఇచ్చారు. రాఖీ కేవలం ఓ దారం కాదని.. ప్రేమ, నమ్మకం, బాధ్యతకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు తనపై చూపిన ఆప్యాయతను ఎప్పటికీ మరచిపోలేనన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మహిళకు తోబుట్టువుగా, పెద్దన్నగా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. మహిళల భద్రత, సంక్షేమం, గౌరవం, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలతో కుటుంబ సభ్యుడిగా మమేకమై వారి సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉండటమే తన లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి తమతో ఆప్యాయంగా మెలుగుతూ సమస్యల పరిష్కారానికి ముందుండటం సంతోషంగా ఉందని మహిళలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా చీరలు బహూకరించడం మరింత ఆత్మీయతను కలిగించిందన్నారు. రాఖీ కట్టిన మహిళలకు చీరల బహూకరణతో.. వనపర్తిలో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి కొత్త నిర్వచనం ఇచ్చారు.

బాలికల విద్య దేశ సాధికారతకు పునాది

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఆగస్టు 28 : రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల సంరక్షణ,విద్య,ఆరోగ్యం, భద్రత,నైపుణ్యాభి వృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఈ.పి ప్రేమలత,బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి,సఖి కేంద్రం సిబ్బంది లావణ్య,జిల్లా బాలల పరిరక్షణ విభాగం,మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ వేళ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అప్యాయతానురాగాల వేడుకలు

- ఎంఈఓ, ఎస్సైలకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు

- సోదరభావంతోనే సమాజంలో ఐక్యత :: ప్రధానోపాధ్యాయులు రాజేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చేరు, ఆగస్టు 28 : అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు సోదర-సోదరీమణుల అనుబంధం, ప్రేమ, అప్యాయతలను ప్రతిబింబించేలా రాఖీలు కట్టుకుని పండుగను ఆనందంగా ఆస్వాదించారు.

అధికారులకు రాఖీ కట్టి...

ఈ వేడుకలను పాఠశాలకే పరిమితం చేయకుండా విద్యార్థులు మరింత ముందుకు వెళ్లారు. సమాజ రక్షణలో నిమగ్నమైన అధికారులకు సైతం రక్షాబంధనం కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. ఇందులో భాగంగా మండల విద్యాధికారి ఎమ్ ఈ వో వి.పి. నాగేశ్వర్ నాయక్ కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించే పోలీసు శాఖను గౌరవిస్తూ స్థానిక ఎస్.ఐ. మహేశ్వర్ రెడ్డి వినోద్ విద్యార్థినిలు రాఖీ కట్టడం విశేషం.

సహనమే సమాజ బలం:

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. రాజేష్ గారు మాట్లాడుతూ... విద్యార్థులందరూ ఎప్పుడూ కలిసిమెలిసి ఉండాలని, సమాజంలో తోటివారిని సోదర సోదరీ భావంతో ఆదరించాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లల్లో మానవతా విలువలను పెంపొందించేలా సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంది.

మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: బండి రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, ఆగస్టు 28 : రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ మహిళా సోదరీమణులు, చందానగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, పలువురు మహిళా నాయకులు శేరిలింగంపల్లి నియోజకవర్గం పిఎస్సి చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్ డివిజన్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా గాంధీ వారికి, నియోజకవర్గ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ మాట్లాడుతూరక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని గాంధీ అన్నారు. సోదరి తన అన్న లేదా తమ్ముడి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కోరుకుంటూ రాఖీ కడుతుందని, సోదరుడు జీవితాంతం అండగా ఉంటాననే భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాఖీ కేవలందారం కాదని,ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణ వంటి విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబాల్లో పరస్పర గౌరవం, ప్రేమానురాగాలు పెంపొందాలని, సోదర సోదరీమణుల అనుబంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని కోరుకుంటూ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ మహిళా నాయకురాలు వరలక్ష్మి, మంజుల, రాధాబాయి, లక్ష్మి, పద్మ, లక్ష్మి శోభ, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కంఠరెడ్డితిరుపతిరెడ్డి పరామర్శ

- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేల ఆర్థికసాయం

- బాధిత కుటుంబాలకు 20వేల ఆర్థిక సహాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్,ఆగస్టు 28 : మెదక్ జిల్లా, నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో పలు కుటుంబాలను శుక్రవారం రోజు బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగమ్మ,ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇటీవల గ్రామంలో రోడ్డు ప్రమాదం,అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలను కూడా తిరుపతిరెడ్డి పరామర్శించారు.సుంచు స్వామి కుటుంబానికి రూ.5 వేలు,దుర్గోల నీలయ్య కుటుంబానికి రూ.5 వేలు,సుంచు ప్రేమ్‌రావు కుటుంబానికి రూ.5 వేలు,బోడబట్ల మల్లయ్య కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి,కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా తెలిపారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు,ఏడుపాయల దేవస్థాన మాజీ చైర్మన్ ఎస్.బాలాగౌడ్,చలమేటి నాగరాజు,మండల యువజన అధ్యక్షుడు మావురం రాజు,లచ్చపేట రాములుగౌడ్,సంగు స్వామి,వార్డు సభ్యుడు పంపరి నగేశ్,తాడెం మల్లేశం,నారాగౌడ్ వెంకటేష్,రాజునాయక్, నరేందర్‌నాయక్, పరశు రాములు,సుభాష్ నాయక్,ఎల్లం యాదవ్, మంగలి నర్సింలు, ఉపసర్పంచ్ రాజశేఖర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు బాలమల్లేశం, మల్లేశం, రాజు, స్వామి, లింగం, సుధాకర్, ప్రభాకర్, రామచంద్రం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా ఆబోతు అశోక్, ప్రధాన కార్యదర్శిగా జలగం ప్రవీణ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మహబూబాబాద్ జిల్లా నాలుగో మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా మహబూబాబాద్ పట్టణంలోని హనుమంతునిగడ్డకు చెందిన ఆబోతు అశోక్, ప్రధాన కార్యదర్శిగా షికార్‌ఖానాగడ్డకు చెందిన జలగం ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏఐవైఎఫ్‌లో ఆబోతు అశోక్ అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ యువజన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ, సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు. అలాగే పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జలగం ప్రవీణ్ ఏఐవైఎఫ్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూ యువజనుల హక్కుల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే మురళి నాయక్‌కు రాఖీ కట్టిన సోదరి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి సందర్భంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ తన క్యాంపు కార్యాలయంలో సోదరి మాలోత్ సరోజ కుమారుడు యువన్ చేత రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోదర-సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.సోదరీమణుల ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడు తనకు అండగా నిలుస్తాయని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో సోదర-సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయతలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.పౌర్ణమి స్వామివారి కృపకు పాత్రులు కావాలని విప్ ఆకాంక్షించారు.

రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ అన్నా చెల్లె ళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అన్నారు. కష్టసుఖాల్లో అండగా ఉంటాననే భరోసాకు రాఖీ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆడపడుచులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఛత్రపతి శివాజీ సేన జిల్లా అధ్యక్షుడిగా బాదేపల్లి నరేష్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, ఆగష్టు 28 : నారాయణపేట జిల్లా ఛత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా మక్తల్ పట్టణానికి చెందిన బాదేపల్లి నరేష్ గౌడ్ ని నియమించినట్లు ఛత్రపతి శివాజీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు లు తోట మధుకర్ తెలిపారు. నారాయణపేట జిల్లాలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్థ కార్యకలాపాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను బాదేపల్లి నరేష్ గౌడ్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బాదేపల్లి నరేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్‌కు, అలాగే ఛత్రపతి శివాజీ సేన సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు, ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నరేష్ గౌడ్ తెలిపారు. నారాయణపేట జిల్లాలో సంస్థను గ్రామస్థాయి వరకు విస్తరించి, యువతను సంఘటితం చేసి, ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన అన్నారు

సీఈఐఆర్‌తో 30 సెల్‌ఫోన్ల గుర్తింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, ఆగస్టు 28 : బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 30 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని అసలైన యజమానులకు అందజేశారు. సీఐ ప్రశాంత్, డీఐ సక్రమ్ బాధితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా సెల్‌ఫోన్లను అందజేశారు. పండగ సమయం లో పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి అందడంతో బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. పోలీసుల చర్యలపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. స్వాధీనం చేసుకున్న మిగిలిన సెల్‌ఫోన్లను శనివారం ఉదయం 10.30 గంటలకు బాలానగర్ ఏసీపీ చేతుల మీదుగా బాధితులకు అందజేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

అప్రమత్తతే దొంగతనాలకు అడ్డుకట్ట

పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెబ్బేరు, ఆగస్టు 28: బస్సుల్లో,రద్దీ ప్రాంతాల్లో జరిగే దొంగత నాల పట్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించి బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు దొంగలు చుట్టూ ఉం డే అవకాశం ఉందని హెచ్చరించారు. డబ్బులు, బంగారు ఆభరణా లు, విలువైన వస్తువులను బహిరంగంగా ఉంచవద్దని, సురక్షిత బ్యాగులో ముందుభాగంలో జిప్ వేసి ఉంచుకోవాలని నగదుకు బదులు డిజిటల్ చెల్లింపులను వాడాలని సూచించారు. ప్రయాణం లో మొబైల్ ఫోన్ లో మునిగిపోకుండా చుట్టూ గమనిస్తూ ఉం డాలని,గుర్తుతెలియని వ్యక్తులను దగ్గరకు రానివ్వవద్దని, ఏటిఎం పిన్, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. నిద్ర సమ యంలో బ్యాగులను కుటుంబ సభ్యులకు అప్పగించాలని, అను మానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయగిరిలో కోతుల బెడద.. కాపాడాలని ప్రజల వేడుకోలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 27 : భువనగిరి పట్టణంలోని రాయగిరి ప్రాంతంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొంతకాలంగా పెద్ద సంఖ్యలో కోతులు ఇళ్ల పరిసరాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా యని స్థానికులు తెలిపారు. కోతులు పలువురిని కరిచి గాయపరిచిన ఘటనలు కూడా జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ముఖ్యంగా చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కోతుల భయంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుకాణాల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఆహార పదార్థాలను కోతులు లాక్కెళ్లడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కోతులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టి, రాయగిరి ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగుకు పునర్వైభవం తేవాలి...

తెలుగుకు పట్టిన తెగులును వదిలించాలి

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా

రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

జంతువుల నుండి మానవుని వేరు చేసేది భాష ఒక్కటే. భాష లేకపోతే మన భావాలను ఇతరులతో వ్యక్తీకరించడం సాధ్యం కాదు. సమాజం ద్వారా వ్యక్తి లోనికి ప్రవేశించి వ్యక్తిని సామాజికుడిని చేసేది మాతృభాష. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది.

ఇదంతా గత కాలం గురించి పూర్తిగా తెలిసిన తెలుగు వారికి, తెలియనిది ఏమీ కాదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి – విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టి పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు... మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం షేక్స్పియర్ ఏమి చదవుకుని, ఆంగ్ల సాహిత్య శిఖరంలా ఎదిగారనేది అర్థం చేసుకోవాలి. భారతావనిలో హిందీ 366 మిలియన్ల, బెంగాలీ 83 మిలియన్ల, తెలుగు 74 మిలియన్ల, తర్వాత మరాఠీ 72, తమిళం 61, కన్నడం 55, ఉర్దూ 52, గుజరాతీ 46, మలయాళం 33, ఒరియా 33 మిలియన్ల మంది మాట్లాడుతూ 10 స్థానాలలో ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు... తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాలి. గొప్పలను ప్రదర్శించడం కాదు... గొప్పలను నిలబెట్టుకోవడమే గొప్ప.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

ఉద్యానవన పంటల సాగుతో లాభదాయక వ్యవసాయానికి ప్రోత్సాహం

- కూరగాయల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందాలి - ఘనపూర్ (స్టేషన్) మండలంలోని శివునిపల్లి గ్రామంలో రైతు పొలాన్ని సందర్శించిన కలెక్టర్ - పందిళ్ల విధానంలో దొండ, పొట్లకాయ, సొరకాయ సాగు పరిశీలన - పిచ్చి మొక్కల నియంత్రణ, తెగుళ్లు, నీటి యాజమాన్యంపై సూచనలు - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఆగస్టు 28 : కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని, రైతులు అధిక ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.

శుక్రవారం, జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) మండలం, శివునిపల్లి గ్రామానికి చెందిన రైతు పిట్టల రాజు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, దొండ, సొరకాయ, పొట్లకాయ సాగును పరిశీలించారు.పందిళ్ల విధానంలో ఏర్పాటు చేసిన తోటను పర్యవేక్షించిన కలెక్టర్, తోట నిర్వహణ తీరు, పంట పెరుగుదల, నీటి వినియోగం, దిగుబడి అవకాశాలపై రైతుతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు.తోట ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారని రైతును అభినందించిన కలెక్టర్, పంట మరింత ఆరోగ్యంగా ఎదగాలంటే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి, కలుపు నియంత్రణ చేపట్టాలని సూచించారు. నీటి నిర్వహణ, పందిళ్ల నిర్వహణ, పంట సంరక్షణ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతును పంట సాగు విస్తీర్ణం, పెట్టుబడి వ్యయం, నీటి వనరు, ప్రభుత్వ సబ్సిడీ లబ్ధి, దిగుబడి, మార్కెటింగ్, తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ఎన్ని ఎకరాల్లో ఈ కూరగాయల పంటలను వేశారు? అని రైతును అడుగగా, పొట్లకాయ సాగు రెండు ఎకరాల్లో వేశామని, సొరకాయ సాగు ఒక ఎకరంలో వేశామని, దొండ కాయ సాగు అర ఎకరంలో వేశామని రైతు, కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా పండిన కూరగాయలను ఎక్కడ విక్రయిస్తున్నారు? ఏ మార్కెట్లకు తరలిస్తున్నారు? ధరలు ఎలా ఉన్నాయి? అనే విషయాలపై కూడా సమగ్రంగా చర్చించారు. అనంతరం పొలంలో ఉన్న పత్తి పంటను కూడా పరిశీలించిన కలెక్టర్, పంట ఆరోగ్యం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. పంటల వైవిధ్యీకరణతో పాటు ఉద్యానవన పంటల సాగు రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఉద్యానవన శాఖ అధికారి సందీప్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ వేళ ఆడబిడ్డకు అండగా జిల్లా కలెక్టర్

- స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్ అందజేత

- ఆత్మవిశ్వాసంతో స్వశక్తిపై నిలబడాలని మహిళకు కలెక్టర్ ప్రోత్సాహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఆగస్టు 28 : రాఖీ పండుగ వేళ ఓ ఆడబిడ్డ జీవితంలో ఆత్మవిశ్వాసం, ఆశలను నింపేలా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదరణగా నిలిచి, స్వావలంబనకు చేయూత అందించారు. శుక్రవారం, జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామానికి చెందిన మహమ్మద్ సుల్తానా బేగం జీవన పరిస్థితులను తెలుసుకొని, ఆమె స్వయం ఉపాధి పొందేందుకు కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల తన ఛాంబర్‌లో కుట్టు మిషన్‌ను అందజేశారు. తన భర్త కుటుంబ బాధ్యతలను వదిలి వెళ్లిపోవడంతో నాలుగేళ్ల చిన్నారితో ఒంటరిగా జీవనం సాగిస్తున్న సుల్తానా బేగం, తనకు స్థిరమైన ఆదాయం లేదని, చిన్న పాపను పోషించేందుకు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆమె పరిస్థితిని సహృదయంతో పరిశీలించిన కలెక్టర్, స్వశక్తితో జీవనోపాధి సంపాదించే మార్గాన్ని చూపాలనే ఉద్దేశంతో వెంటనే కుట్టు మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళ తనలోని సామర్థ్యాన్ని నమ్ముకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. కష్టపడే వారికి అవకాశాలు తప్పక లభిస్తాయని, ఈ కుట్టు మిషన్ సుల్తానా బేగం జీవితానికి కొత్త ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. కుట్టు పనిని ఉపాధిగా మలుచుకొని తన చిన్నారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని, కుటుంబానికి అండగా నిలవడంతో పాటు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలని సూచించారు. రాఖీ పండుగ సోదర–సోదరీమణుల అనుబంధానికి ప్రతీక అని పేర్కొంటూ, సమాజంలోని ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. కుట్టు మిషన్ అందుకున్న మహమ్మద్ సుల్తానా బేగం, జిల్లా కలెక్టర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం తనకు కొత్త జీవితంపై ఆశను కల్పించిందని, కష్టపడి పని చేసి, తన కుమార్తెను మంచి చదువులు చదివించి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకొని అందించిన ఈ కుట్టు మిషన్ ఒక మహిళ జీవితంలో కొత్త ఆశలకు నాంది పలికింది. కష్టపడి స్వశక్తితో జీవనోపాధి సంపాదిస్తూ తన చిన్నారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే ఆమె సంకల్పానికి ఇది బలమైన చేయూతగా నిలిచింది. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగితే ప్రతి మహిళ స్వావలంబన సాధించి, తన కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవగలదనే సందేశాన్ని ఈ సంఘటన చాటి చెప్పింది.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్ 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 1,08,500 క్యూసెక్కుల ప్రవాహం రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ గరిష్ఠ ప్రవాహం బరాజ్ రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 100 మీటర్లు కాగ, ప్రస్తుతం 90.50 మీటర్లలో ఉందని భారీనీటిపారుదల శాఖ ఈఈ సరేశ్ తెలిపారు.

చెస్ మాస్టర్ ప్రజ్ఞానందకు సిఎం రేవంత్ అభినందనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్ట్ 28 : అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని, చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీయువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కొత్తగూడెం, ఆగస్ట్ 28 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్న సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గొమ్మూరు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి టాటా మ్యాజిక్ వాహనంలో 10 బస్తాలు (5 క్వింటాళ్ల రేషన్ బియ్యం) రేషన్ బియ్యం కిలో రూ.17 చొప్పున కొనుగోలు చేసి వాహనంలో తీసుకువెళ్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ మేడా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వెళ్లి టాటా మ్యాజిక్, బియ్యంను స్వాధీనం చేసుకుని వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వికారాబాద్ డిఆర్ఓ మంగీలాల్ మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్, ఆగస్టు 28 : వికారాబాద్ జిల్లా డిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న మంగీలాల్ అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో సెలవు లో ఉన్న ఆయన గురువారం కన్నుమూశారు. డీఆర్వోగా పనిచేసిన కొద్దికాలంలోనే మంచి పరిపాలనా నైపుణ్యంతో విధులు నిర్వర్తించారని ఉద్యోగులు కొనియాడారు. ప్రజా సేవలో చక్కటి పనితీరు కనబరిచిన అధికారిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

మాల మహానాడు భద్రాద్రి జిల్లా యూత్ అధ్యక్షుడిగా వాసుమళ్ల గౌతమ్

- 1350 కిలోమీటర్ల పాదయాత్రలో సేవా తత్వాన్ని గుర్తించిన రాష్ట్ర అధ్యక్షుడు.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఆగస్టు 28 : మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడిగా పాల్వంచకు చెందిన వాసుమళ్ల గౌతమ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ శుక్రవారం గౌతమ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. మాలల ఐక్యత, హక్కులు, అభివృద్ధి కోసం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌తో కలిసి గౌతమ్ గతంలో 1350 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌లోని సేవా దృక్పథం, ఉదార స్వభావం, కష్టపడి పనిచేసే తత్వాన్ని గుర్తించిన రాష్ట్ర అధ్యక్షుడు యూత్ విభాగం జిల్లా అధ్యక్ష బాధ్యతలకు ఆయనను ఎంపిక చేసినట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాసుమళ్ల గౌతమ్ మాట్లాడుతూ.. మాలల ఐక్యత, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమళ్ల సుందరరావు, జిల్లా అధ్యక్షుడు తోటమళ్ల రమణమూర్తి, సెనగ వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడెల్లి గణపతి, పెంకి శ్రీనివాసరావు, వల్లమళ్ల వెంకటరత్నం, గడిదేసి ప్రభాకర్, శనగ రామ్‌చందర్‌రావు, హరీష్, కూరపాటి దాస్, శెట్టి కమలాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- మహిళలను గౌరవిస్తూ ముందుకు సాగాలి: కళాశాల ప్రిన్సిపల్ ఏ.అనిత.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

అశ్వారావుపేట, ఆగస్టు 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏ.అనిత మాట్లాడుతూ.. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అన్నారు. సోదరీమణులు సోదరుల చేతికి రాఖీ కట్టి వారి సుఖసంతోషాలు, ఆయురారోగ్యం, అభివృద్ధిని కోరుకుంటారని, సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేస్తారని తెలిపారు. రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల బంధానికే పరిమితం కాదని, కుటుంబ విలువలు, ప్రేమ, నమ్మకం, బాధ్యత, ఐక్యత, పరస్పర గౌరవాన్ని గుర్తుచేసే పండుగ అని విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.నరసింహారావు మాట్లాడుతూ.. 'రక్ష' అంటే రక్షణ, 'బంధన్' అంటే బంధం అని వివరించారు. రక్షాబంధన్ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, రక్షణ బంధానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి పౌరుడు మహిళలను గౌరవిస్తూ ముందుకు సాగాలని, మహిళలపై జరిగే అరాచకాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ ఏ.అనిత ఆధ్వర్యంలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ఐటీడీఏ ఉపాధ్యాయ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు

29, 30 తేదీల్లో నిర్వహణ.. ఐదు డివిజన్ల నుంచి క్రీడాకారుల ఎంపిక.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఆగస్టు 28 : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 29, 30 తేదీల్లో కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన క్రీడల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ క్రీడల అధికారి బొల్లి గోపాలరావు తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు శుక్ర వారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలో క్రీడా పోటీలను మూడు అంచెలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఇంటర్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పోటీలు నిర్వహించి, అనంతరం డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. భద్రాచలం, ఇల్లందు, దమ్మపేట, ఖమ్మం, వైరా డివిజన్లలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన ఉపాధ్యాయ, ఉద్యోగ క్రీడాకారులతో జిల్లా స్థాయి జట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా స్థాయి పోటీల్లో వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, 60 మీటర్ల పరుగు, షాట్‌పుట్, టెన్నికాయిట్ తదితర క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చందన ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు డివిజన్ల ఏటీడీవోలు, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారులు పర్యవేక్షణలో పోటీలు సజావుగా నిర్వహించనున్నట్లు క్రీడల అధికారి బొల్లి గోపాలరావు తెలిపారు.

అశ్వారావుపేటలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీకగా రాఖీ పండుగ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

అశ్వారావుపేట, ఆగస్టు 28:అశ్వారావుపేట నియోజకవర్గంలో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పట్టణాల్లో నివసించే యువతీ యువకులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలివచ్చారు. దీంతో పల్లెల్లో పండుగ సందడి నెలకొంది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, సోదరులు వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అశ్వారావుపేట పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ యువతీ యువకులు రక్షాబంధన్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పరస్పరం రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన వేడుకలను అధ్యాపకులు తిలకించి సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమకారుల భద్రాద్రి జిల్లా కమిటీ ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా శ్రావణ బోయిన నర్సయ్య.. ప్రధాన కార్యదర్శిగా కాకెల్లి సైమన్.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఆగస్టు 28 : తెలంగాణ ఉద్యమకారుల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో తొలి మలి 1969 ఉద్యమ పోరాట సమితి సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ బోయిన నర్సయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రావణ బోయిన నర్సయ్య, ఉపాధ్యక్షులుగా పిల్లి రాజయ్య, శ్రీపాద సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కాకెల్లి సైమన్, సహాయ కార్యదర్శులుగా దేవులపల్లి రాంమూర్తి, గాజుల తిరుపతయ్య ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా కుడిక్యాల సమ్మయ్య, ఎం.డి. సప్తార్ బేగ్, ఎం.డి. అలిముద్దీన్, ఎస్.కె. జానీమియా, ప్రచార కార్యదర్శులుగా సయ్యద్ దావీద్, కొమ్ము వీరాస్వామి, ఎం.డి. అబ్దుల్ సలీం, సరిగిడి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఈ.వి. నికోలస్, సహాయ కోశాధికారిగా గడ్డం రాజయ్యను ఎన్నుకున్నారు.



ఘనంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదిన వేడుకలు

- అభిమానుల మెగా రక్తదాన శిబిరం - పరిసర గ్రామాల నుండి పెద్ద మొత్తంలో తరలివచ్చిన ప్రజలు

- ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే - ఎమ్మెల్యే కు తులభారం వేసిన అభిమానులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్' ఆగస్ట్ 28 : భైంసా పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు ఉదయం నుండి ఆయన నివాసమైన ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ జనసంద్రమైంది. ఉదయం వేళ బాసర ఆలయ ఇ. వో తో పాటు ఆలయ అర్చకులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ఆశీర్వచనాన్ని అందజేశారు.. ఉదయం నుండి రాత్రి వరకు ఎమ్మెల్యే నివాసానికి అన్ని మండలాలోని గ్రామ ల నుండి కార్యకర్తలు, నాయకులు పెద్ద మొత్తం లో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు అభిమానుల తులాభారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా అభిమానులు లడ్డుతో తులాభారం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జన్మదినోత్సవం వేళ అభిమానులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 40 మందికి పైగా రక్తదానం చేశారు. ఉదయం వేళ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ప్రారంభించారు. అలాగే ఎమ్మెల్యే జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆశ్రమ పాఠశాలలో బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు కేక్ కట్ చేసి, రాఖీలు కట్టి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలకు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభమై పనులు ప్రారంభమవుతాయన్నారు. కాగా జన్మదినోత్సవం వేళ ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ పురుషోత్తమ్ మహారాజ్ కీర్తన ప్రవచనం ఉ ండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా తన ప్రవచనాన్ని కీర్తన రూపంలో అందించారు. అశేష జన వాహిని తరలిరావడంతో జన్మదిన ఉత్సవం పండుగలా సాగింది.

భూముల రీ సర్వే పరిశీలించిన అదనపు కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల (బోయినపల్లి), ఆగస్టు 28 : బోయినపల్లి మండలం కొత్తపేటలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా తీసుకుంటున్నారో పరిశీలించి.. అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భూముల వివరాలను పూర్తి పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ షరీఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పులాజి బాబా జయంతి ఏర్పాట్ల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఆగస్టు 28 : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు పూలాజీ బాబా 82వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం పరిశీలించారు. జయంతి ఉత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఈఈ జాదవ్ తానాజీతో కలిసి ఉ త్సవ ప్రాంగణాన్ని పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్ తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, భక్తుల రాకపోకలు, భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఉత్సవాల సమయంలో ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాదవ్ అంబాజీ సూచించారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే జయంతి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అన్నా, చెల్లెలు, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఆగస్టు 28 : అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా సంవత్సరానికి ఒకసారి జరుపుకునే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోదరికి తన సోదరుడు కలకాలం రక్షగా, తోడుగా ఉంటాననే నమ్మకాన్ని, భరోసాను రాఖీ పండుగ ద్వారా కల్పిస్తాడని,అదే నమ్మకంతో అక్కా,చెల్లెళ్లు తన సోదరులకు రక్షాబంధన్ కడతారని తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం పాన్గల్ లో ఉన్న చారుమతి అనాధాశ్రమ బాలికలు జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టారు. సోదరీ, సోదరుల ప్రేమానుబంధాలతోపాటు, వారికి రక్షగా నిలుస్తామనే భరోసాను కల్పించే రాఖి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు .తనకు రాఖీలు కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాఖీ పండగతో వాహనాల రద్దీ

వేములవాడలో ట్రాఫిక్ జామ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, ఆగస్ట్28 : వేములవాడ పట్టణంలోని బస్టాండ్ వద్ద వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం రక్షాబంధన్ వేడుకల సందర్భంగా ఇతర పట్టణాలు గ్రామాల నుండి వేములవాడకు చేరే కరీంనగర్, నంది కమాన్ రహదారులతోపాటు తిరిగి వెళ్లేందుకు మూలవాగు వంతెన పై సైతం వాహనాల రద్దీ నెలకొంది. రెండవ బైపాస్ రహదారి పార్క్ నుండి మొదలుకొని తిప్పాపూర్ బస్టాండ్ వరకు వాహనాలు ఒకదానిని ఆనుకొని మరొకటి మెల్లిగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కరీంనగర్ నుండి, సిరిసిల్ల వైపు నుండి కూడా వేములవాడ కూడా భారీగా వాహనాలు వస్తుండగా బస్టాండ్ కూడలి వాహనాలతో రద్దీగా మారింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి బస్టాండ్ కూడలి వద్ద రహదారులను నియంత్రిస్తూ ట్రాఫిక్ ను అదుపులోకి తెచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని తక్షణమే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వాహనదారులు సురక్షితంగా బయటపడ్డారు.

సర్ నోటీసులపై పంచాయితీల్లో విచారణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఆగస్ట్ 28 : ఆదిలాబాద్ జిల్లా దస్తూరాబాద్ మండలంలో సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ యాదవ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విచారణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన విచారణ తేదీన ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ సూచించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. మండలంలో మ్యాపింగ్ కానిఓటర్లు 372మంది ఉండగా, పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్న ఓటర్లు 2,976 మంది ఉన్నట్లు తహసీల్దా ర్ వివరించారు. మొత్తం 3,348 మంది ఓటర్లకు నోటీసులు అందజేయ నున్నట్లు తెలిపారు. ఓటర్లు నిర్ణీత గడువులోగా విచారణకు హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.

నార్సింగ్‌లో హిట్ అండ్ రన్

- డెలివరీ బాయ్ బైకును ఢీకొట్టి పరార్

- ప్రమాదంలో డెలివీర బాయ్ అక్కడిక్కడే మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఆగస్ట్ 28 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నార్సింగి ప్రధాన రహదారిపై చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ ప్రమాదంలో ఒక డెలివరీ బాయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడమే కాకుండా, వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారైంది. హైదరాబాద్ గోల్కొండ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే యువకుడు 'ఫస్ట్ క్లబ్' సంస్థలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల నిర్వహణలో భాగంగా నార్సింగి నుండి గండిపేట వైపు ఆర్డర్ డెలివరీ తీసుకొని బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగంతో వెనుక నుండి వచ్చిన అపరిచిత వాహనం సమద్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ దెబ్బకు బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై పడటంతో సమద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించేందుకు రహదారిపై ఉన్న సిసిటీవీ ఫుటేజ్‌ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

స్కూళ్లలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించండి

తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఆగస్ట్ 28 : ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరి -మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని, లేదంటే సెప్టెంబర్ 17న బడులకు తాళాలు వేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. దీనికి సంబంధించి శుక్రవారం మన ఊరు మనబడి పథకంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు, ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతిప్రతం అందజేశారు. పనులు పూర్తి చేసిన మూడేండ్లు అయినా బిల్లులు చెల్లించలేదని, అప్పులు చేసి పనులు చేయించామని వారు వినతిలో ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులతో మానసిక ఒత్తిడి గురై ఆత్మహత్యలే శరణ్యంగా మారిందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేనిచో పనులు చేసినా బిల్లలు రాని బడులకు గత్యంతరం లేక తాళాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్ల బాధలు తెలుసుకుని బిల్లలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వసంతరావు, వి.రామిరెడ్డి, గడిపర్తి వీరభద్రరావు,

గోదావరిఖనిలో మృత్యుంజయ హోమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని, ఆగస్ట్ 28 : రాఖీ పూర్ణిమ పర్వదినం పురస్కరించుకొని లోక కల్యాణార్థం గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల శ్రీ మార్కండేయ శివాలయం ఆవరణలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి రోజున మార్కండేయుడి సన్నిధిలో జరిగే ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు చిగురాల రాఘవాచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య రక్షాబంధన, యజ్ఞోపవీత దారణ, గణపతి, నవగ్రహ, మార్కండేయ పూజలతోపాటు మృత్యుంజయ హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచికట్ల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, వంగ వీరస్వామి, రాజమల్లు, గడ్డం జానకీరాం, కానుగంటి నారాయణ, పోరండ్ల కొమురయ్య, ఆర్ఎస్ మూర్తి, మాటేటి సతీష్, బొద్దుల వేణు, గడ్డం సత్యనారాయణ, అడిచర్ల నంబయ్య, గోసిక సత్యం, నాగేశ్వరరావుతోపాటు అధిక సంఖ్యలో పద్మశాలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో బ్యాంక్ ఖాతాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఆగస్ట్ 28 : విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సకాలంలో వారి ఖాతాల్లో జమ అయ్యేలా బ్యాంకు ఖాతాల ప్రారంభ ప్రక్రియను వేగవంతం చేయాలని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ బ్యాంకర్లకు సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించిన ఖానాపూర్ ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం శు క్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెస్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ముద్రా, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాల అమలు, వాటికి సంబంధించిన సాంకేతిక మద్దతు విధానాలను బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులకు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సుమారు 2 వేల కొత్త బ్యాంకు ఖాతాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులు, బ్యాంకు మేనేజర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

నునవత్ రాధ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నునవత్ రాధ గారి భర్త ప్రథమ వర్ధంతి (సంవత్సరికం) కార్యక్రమానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దివంగతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మీ గౌడ్, నెల్లికుదురు మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి, గూడూరు మండల అధ్యక్షుడు బాలాజీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు నునవత్ రాధ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని తెలిపారు.

పాపన్న పేటలో ఘనంగా శ్రీరామ భాణాల ఊరేగింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఆగస్టు 28 : మండల కేంద్రమైన పాపన్నపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం రాఖి పౌర్ణమి శుక్రవారం రోజు శ్రీ రామ బాణాల శోభాయాత్ర కార్యక్రమం సాయంత్రం పద్మశాలి సంఘం వద్ద నుండి మొదలై గ్రామ పురవీధుల గుండా భక్తి భజన పాటలతో బాణాల ఊరేగింపు కార్యక్రమం శివాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట పద్మశాలి సంఘం చైర్మన్ కొడుపాక విఠల్, వైస్ చైర్మన్ పల్లె సంగమేశ్వర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు వళ్ళందేశి శ్రీనివాస్, పడిగే కృష్ణ, దాసరి యాదగిరి, కొడుపాక శివశంకర్, జూకంటి సంగయ్య, అచ్చుకట్ల గురునాద్, చామంతుల మల్లయ్య, పల్లె లక్ష్మణ్,పల్లె రాజు,, బద్దాపురం సంగమేశ్వర్, తూర్పు రాములు, తూర్పు రాజు, తూర్పు రాము, వళ్ళందేశి శివకుమార్, పల్లె రాములు, మదనాల అరవింద్, అచ్చుకట్ల మహేష్, చామంతుల అరవింద్ వళ్ళందేశి మల్లేశం, కొడుపాక ఉమామహేశ్వర్, కొడుపాక పూర్ణ చందర్, రాజారాం, చంద్రం, పల్లె ప్రసాద్, పడిగే శ్రీకాంత్, పల్లె సాయి కిరణ్, బద్దాపురం రాజు, ఊరటి లక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్ లో ఘనంగా నాగ్సాన్ పల్లి సర్పంచ్ కుమారుని వివాహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఆగస్టు 28 : పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్‌పల్లి సర్పంచ్ దండెం సుశీల దుర్గేష్ కుమారుడు మహిపాల్ శృతి వివాహం శుక్రవారం లక్ష్మీనగర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ కర్చర్ల నర్సింలు గౌడ్, సీనియర్ నాయకులు రవీందర్ గుప్తా, మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు,బంధువులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయండి

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాదయాత్ర

కామారెడ్డి, ఆగస్ట్ 28 : జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి మండలంలోని మహ్మదాబాద్ చౌరస్తా నుండి జుక్కల్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించి బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సైతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రపోతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2015-16లో రహదారిని వెడల్పు చేసి బీటీ రోడ్డు నిర్మించామని, రోడ్డు మరమ్మతులకు రావడంతో తమ ప్రభుత్వ హయాంలో రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల కోసం,అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర కొనసాగుతోందని ఆయన చెప్పారు.

చెట్టుకు రాఖీ కట్టిన పర్యావరణ ప్రేమికుడు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఆగస్ట్ 28 : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ జరుపుకుంటారు. అయితే ఈ పండుగ వేళ ఓ పర్యావరణ ప్రేమికుడు మాత్రం వినూత్నంగా ఆలోచించి.. పర్యావరణంపై తన ప్రేమను వ్యక్తం చేశాడు. గతంలో తాను నాటిన రావి చెట్టు మహావృక్షంగా ఎదగడంతో.. అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. రాఖీ పండగ సందర్భంగా ఆ చెట్టుకు ఆవు పిడకతో చేసిన రాఖీని కట్టి తన ప్రత్యేక అభి మానాన్ని చాటుకున్నాడు. అతడి పేరు సురేష్ గుప్తా. అతడి స్వస్థలం నల్గొండ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు మనకు ప్రాణవాయువును అందిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని పేర్కొన్నారు. వాటిని సొంత కుటుంబ సభ్యుల్లా భావించి సంరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చెట్టుకు రాఖీ కట్టి దానిని సంరక్షణకు ప్రతిజ్ఞ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సందేశాన్ని ఇచ్చినట్లు సురేష్ గుప్తా వెల్లడించారు

హెల్మెట్ ధరించిండి..భయ్యా

రాఖీ కట్టి హితబోధ చేసిన పోలీసులు

కామారెడ్డి, ఆగస్ట్ 28 : హెల్మెట్లు లేని వాహనదారులకు ఎప్పుడూ చలాన్లు వేసే ట్రాఫిక్ పోలీసులు.. నేడు రక్షా బంధన్ సందర్భంగా ప్రేమతో రాఖీలు కట్టారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాలతో పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో రాఖీ పూర్ణిమ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి బొట్టు పెట్టి, రాఖీ కట్టి.. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు ట్రాఫిక్ పోలీసులు. హెల్మెట్ ధరించడం ప్రతి కుటుంబానికీ రక్ష అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల బారినపడతారని హెచ్చరించారు. రక్షా బంధన్ నాడు రాఖీ ఎంత రక్షణ ఇస్తుందని విశ్వసిస్తామో.. హెల్మెట్ కూడా నిత్యం అంతే రక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. పోలీసులు ఇలా ద్విచక్ర వాహనదారులను ఆపి ఆప్యాయంగా రాఖీ కట్టడం చూసి వాహనదారులు అవాక్కయ్యారు. ఈ రకమైన శైలిలో వినూత్నంగా అవగాహన కల్పించడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు.

సినిమా న్యూస్

లైన్ లో కనిపించని భాగ్య శ్రీ బోర్సే!

అతి తక్కువ సమయంలోనే భారీ క్రేజ్ సంపాదించుకున్న కథానాయికలలో భాగ్యశ్రీ బోర్సే ఒకరు. గ్లామర్ ..నటనతో తొలి సినిమా నుంచే ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన భామ, ఒకానొక దశలో వరుస అవకాశాలతో ఎంతో బిజీగా కనిపించింది. అంతకుముందు ఒక సినిమా సెట్స్‌పై ఉండగానే మరొక క్రేజీ ప్రాజెక్ట్ చేతిలో ఉండేది. అయితే ప్రస్తుతం టాలీవుడ్ లైనప్‌లో భాగ్యశ్రీ పేరు పెద్దగా వినిపించకపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల విడుదలైన -లెనిన్- చిత్రం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా అందులో భాగ్యశ్రీ నటనకు మంచి మార్కులే పడ్డాయి. సినిమా విజయం సాధించిన తర్వాత సాధారణంగా కథానాయికలకు కొత్త ఆఫర్ల వరద పారుతుంటుంది. కానీ -లెనిన్- తెచ్చిన పాజిటివ్ వైబ్ తర్వాత కూడా భాగ్యశ్రీకి తెలుగులో కొత్తగా పెద్దగా అవకాశాలు రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆమె తదుపరి తెలుగు ప్రాజెక్ట్ గురించిన అధికారిక ప్రకటన ఏదీ ఇప్పటివరకు వెలువడలేదు. ప్రస్తుతం భాగ్య శ్రీ చేతిలో ఉన్న ఏకైక ప్రాజెక్ట్ కోలీవుడ్‌కు చెందిన -సేయాన్- మాత్రమే. తమిళ్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అమ్మడు చాలా ఆశలు పెట్టుకుంది. అధికారికంగా ఆమె ఖాతాలో ఉన్నది ఒక్క ప్రాజెక్టే కావడంతో టాలీవుడ్ నుంచి ఆమెకు సరైన ఆఫర్లు రావడం లేదా లేక ఆమె స్వయంగా పాత్రల ఎంపికలో జాగ్రత్త వహిస్తోందా? ఈ క్రమంలో వచ్చిన సినిమాలను తిరస్కరిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినీ పరిశ్రమలో సక్సెస్ ఎంత ముఖ్యమో? దాన్ని నిలబెట్టుకోవడానికి సరైన ప్లానింగ్ ప్రాజెక్ట్‌లఎంపిక అంతకంటే ముఖ్యం. -లెనిన్- సక్సెస్ సాధించినప్పటికీ దాన్ని కెరీర్‌వేగానికి అనుకూలంగా మలచుకోవడంలో భాగ్యశ్రీ కొంత నెమ్మదించినట్లే కనిపిస్తోంది. టాలీవుడ్‌లో కొత్త భామల నుంచి పోటీ తీవ్రంగా ఉండటంతో ఒకసారి గ్యాప్ వస్తే మళ్లీ రేసులోకి రావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే భాగ్యశ్రీ బోర్సే తదుపరి సినిమాల విషయంలో తొందర పడకుండా పవర్‌ఫుల్ , ప్రాధాన్యత ఉన్న పాత్రలకే ప్రాధాన్యమివ్వాలని భావిస్తున్నట్లు వినబడుతోంది. విభిన్నమైన కథాంశాలతో వచ్చే ప్రాజెక్ట్‌ల కోసమే అమ్మడు వేచి చూస్తోందని.. త్వరలోనే ఓ పెద్ద ప్రాజెక్ట్‌తో తెలుగు ప్రేక్షకులను పలకరించే అవకాశం ఉందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. మరో విచిత్రం ఏంటంటే? అమ్మడు ఫెయిల్యూర్స్ లో ఉన్న సమయంలోనే ఎక్కువ అవకాశాలు వచ్చేవి. విజయాలు లేకపోయినా? కొత్త ఛాన్సులు ఎలా అందుకుంటుందనే ఆశ్చర్యం సర్వత్రా వ్యక్తమయ్యేది. కానీ లెనిన్ లాంటి యావరేజ్ హిట్ ఉన్నా? అమ్మడి ఖాతాలో టాలీవుడ్ నుంచి కొత్త ఛాన్సులు రకపోవడమే వింతగా ఉంది. మరి ఈ గట్టు ఎప్పుడు వీడుతుందో చూడాలి.

5 దశాబ్దాల ప్రయాణం..

జీ.వీ. నారాయణరావు మరణంపై చిరంజీవి ఎమోషనల్ కామెంట్స్!

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మెగాస్టార్ చిరంజీవితో ఎంతోమంది సీనియర్ నటులకు మంచి అనుబంధమున్న విషయం తెలిసిందే. అయితే ఆ అనుబంధాన్ని ఆయన దశాబ్దాల తరబడి కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే అలాంటి అనుబంధం ఒక్కసారిగా తెగిపోతే.. ఆ క్షణం వర్ణనాతీతం ..ఇప్పుడు అదే క్షణాలు తన మనసులో తనను దుఃఖానికి గురిచేస్తున్నాయి అంటూ మెగాస్టార్ చిరంజీవి చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ప్రముఖ సీనియర్ నటుడు జీవీ నారాయణరావుతో ఆయనకు పరిచయం ఏర్పడింది . 1977లో మొదలైన పరిచయం ఇప్పటికీ కొనసాగుతూ ఉండడం గమనార్హం . అలాంటి జీవి నారాయణ రావు అనారోగ్య సమస్యలతో తుది శ్వాస విడిచారు. నారాయణ రావు మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్న మెగాస్టార్ చిరంజీవి ఎమోషనల్ అవుతూ ఆయనతో పనిచేసిన రోజులను, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానంలో ఆగస్టు 27న పలువురు ప్రముఖులు , కుటుంబ సభ్యుల సమక్షంలో జీవీ నారాయణ రావు అంత్యక్రియలు ముగిసాయి. ఈ అంత్యక్రియలలో పాల్గొన్న చిరంజీవి కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. "నా ఆత్మీయ మిత్రుడు జీవీ నారాయణరావు ఇక లేరనే వార్త నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. నటుడిగా, నిర్మాత గానే కాకుండా వ్యక్తిగతంగా మా మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉంది. నేను నటించిన దేవాంతకుడు, యముడికి మొగుడు చిత్రాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. ముఖ్యంగా ఈ సినిమాలకు పనిచేస్తున్న రోజుల్లో ఎన్నో మధురమైన జ్ఞాపకాలు మాకు మిగిలాయి. జీవి నారాయణరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. జీ.వీ.నారాయణ కుటుంబ సభ్యులు కూడా నా కుటుంబ సభ్యులే. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అంటూ చిరంజీవి ఎమోషనల్ అయ్యారు. 1976లో అంతులేని కథ అనే చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు జీవి నారాయణరావు. ఈ చిత్రానికి కే బాలచందర్ దర్శకత్వం వహించారు. నటుడుగానే కాకుండా నిర్మాతగా కూడా మంచి పేరు సొంతం చేసుకున్నారు. ఇకపోతే చిరంజీవి నటించిన చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించడమే కాకుండా చిరంజీవి నటించిన గ్యాంగ్ లీడర్, హిట్లర్ వంటి సినిమాలలో జీవి నారాయణరావు నటించారు కూడా. ఈయన పలు టెలివిజన్ సీరియల్స్ లో కూడా తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఏదేమైనా టాలీవుడ్ సినీ పరిశ్రమ నారాయణరావు లాంటి ఒక మంచి నటుడిని, నిర్మాతను కోల్పోయిందని.. పలువురు సినీ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

ఒర్రీకి నరకం చూపించిన హీరోయిన్ మామ్!

సోషల్ మీడియాలో తనదైన స్టైల్‌తో, సెలబ్రిటీలతో ఉన్న ఫోటోలతో ట్రెండ్ అయ్యే ఒర్రీ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఆయన ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి సారా అలీ ఖాన్ తల్లి, సీనియర్ నటి అమృత సింగ్ గురించి చేసిన వ్యాఖ్యలు బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారాయి. 2021లో తాను ఎదుర్కొన్న ఓ చేదు అనుభవం తన జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందని ఒర్రీ వెల్లడించారు. సారా అలీ ఖాన్‌కు ప్రాణ స్నేహితుడిగా ఉండే ఒరి గతంలో ఆమె కుటుంబంతో కలిసి గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో అమృత సింగ్ తనను ఎంతగానో మానసిక వేదనకు గురిచేశారని.. తనకు ఒకరకంగా నరకం చూపించారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి సంఘటనలు మానసికంగా ఎంతో కృంగదీశాయని, ఆ కష్టకాలమే తనను జీవితంలో దృఢంగా మార్చిందని పేర్కొన్నారు. అయితే ఆ కాలంలో ఎదురైన తీవ్రమైన మానసిక క్షోభే తనలో కొత్త మార్పునకు కారణమైందని ఒరి తెలిపారు. ఆ అనుభవం తర్వాతే తాను సోషల్ మీడియాలో వచ్చే విమర్శలకు, ట్రోల్స్‌కు పూర్తిగా అతీతంగా మారానని, ఎలాంటి ద్వేషాన్ని అయినా తట్టుకునే శక్తిని ఆ కాలమే తనకు నేర్పించిందన్నారు. ఇతరులు తనపై చూపే వ్యతిరేకతను ఎలా ఎదుర్కోవాలో ఆ కష్టకాలమే తనకు పాఠంలా నేర్పిందని వెల్లడించారు. సారా అలీ ఖాన్‌తో తనకు ఇప్పటికీ మంచి స్నేహబంధం ఉన్నా? ఆ కుటుంబంతో తన అనుభవాల గురించి ఒరి ఇంత బహిరంగంగా మాట్లాడటం సినీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సెలబ్రిటీ సర్కిల్స్‌లో ఎంతో క్లోజ్‌గా ఉండే ఒరి లాంటి వ్యక్తి ఇలాంటి వ్యక్తిగత విషయాలను పంచుకోవడం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెలబ్రిటీల లైఫ్‌స్టైల్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఒరి ఇంటర్వ్యూ ద్వారా తన గతం వెనుక ఉన్న చీకటి కోణాలను పంచుకున్నారు. బాహ్య ప్రపంచానికి ఎంతో సరదాగా? లగ్జరీగా కనిపించే సెలబ్రిటీల జీవితాల వెనుక కూడా ఎన్నో మానసిక సంఘర్షణలు ఉంటాయని ఆయన మాటలు నిరూపిస్తున్నాయి. ఒర్రీ చెప్పిన విషయాలు ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఒర్రీకి సోషల్ మీడియాలో ఏ రేంజ్ లో ఫాలోయింగ్ ఉందో చెప్పాల్సిన పనిలేదు. కేవలం సెలబ్రిటీలతో రిలేషన్ షిప్స్...వారితో ఫోటోలు తీసుకుని ఖాతాల్లో పోస్ట్ చేసే లక్షల్లో సంపాదిస్తున్నాడు. ఓ నటుడి కంటే ఎక్కువ ఆదాయం ఒర్రీ పెద్దగా కష్టపడకుండానే సంపాదిస్తున్నాడు. ఈ విషయంలో ఒర్రీ స్ట్రాటజీ ఎంతో ప్రత్యేకమైందనే చెప్పాలి.

స్పిరిట్ ఒకవైపు.. కొత్త టాలెంట్ మరోవైపు

'అర్జున్ రెడ్డి' నుంచి 'యానిమల్' వరకు భద్రకాళీ పిక్చర్స్ పేరు ఎక్కువగా సందీప్ రెడ్డి వంగా సినిమాలతోనే వినిపించింది. స్పిరిట్ కూడా నడుస్తోంది. ఇప్పుడు అదే బ్యానర్ నుంచి 'రోమాంచకం' రావడం మాత్రం కాస్త వేరే స్టెప్. సుమంత్ ప్రభాస్ హీరోగా, అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. సెప్టెంబర్ 3న రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఇక్కడ సినిమా కంటే దాని వెనకున్న టీమ్ సెలక్షన్ మరో కొత్త ట్రెండ్ ను తెస్తోంది. ట్రైలర్ ఈవెంట్‌లో నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా కూడా ఇదే విషయాన్ని చెప్పాడు. ఈ సినిమా విజయం తమ బ్యానర్ కంటే ఇందులో పనిచేసిన యంగ్ టీమ్‌కు ఎక్కువ అవసరమని అన్నాడు. దర్శకుడు, హీరో, హీరోయిన్‌తో పాటు చాలామంది ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ కొత్తవాళ్లు లేదా రెండు మూడు సినిమాల అనుభవం ఉన్నవాళ్లేనని చెప్పాడు. వాళ్లకు ఈ సినిమాతో గుర్తింపురావాలని కోరుకున్నాడు. ఇది భద్రకాళీకి కూడా ఇప్పటివరకు చేసిన సినిమాలతో పోలిస్తే కొత్త ప్రయత్నమే. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' అన్నీ వంగా దర్శకత్వంతోనే పెద్ద స్థాయికి వెళ్లాయి. ఇప్పుడు తనే డైరెక్ట్ చేయని, స్టార్ హీరో కూడా లేని సినిమాను ఇదే బ్యానర్ ముందుకు తీసుకురావడం మొదలైంది. 'రోమాంచకం' క్లిక్ అయితే ఇలాంటి మరిన్ని సినిమాలకు డోర్ ఓపెన్ అయ్యే అవకాశం ఉంటుంది.ఇక్కడ సందీప్ వంగా పేరు కొత్త టీమ్‌కు పెద్ద ప్లస్ అవుతుంది. సాధారణంగా కొత్త హీరో, దర్శకుడి సినిమా ప్రేక్షకుల దృష్టిలో పడాలంటే ప్రమోషన్స్ నుంచే పెద్ద పోరాటం ఉంటుంది. కానీ వంగా ప్రెజెంటర్‌గా ఉండటంతో 'రోమాంచకం' ట్రైలర్ ఈవెంట్ నుంచే ఎక్కువ మందికి చేరింది. సినిమా చివరకు కంటెంట్ మీదే నిలబడాలి. కానీ మొదట ప్రేక్షకుడిని థియేటర్ వరకు తీసుకొచ్చే విషయంలో ఇలాంటి పేరు ఉపయోగపడుతుంది. పైగా కథ నచ్చిన వెంటనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నామని టీమ్ చెబుతోంది. షూటింగ్‌కు ముందు మూడు నెలలు నటులతో రిహార్సల్స్ చేయించారని, ముందుగా అనుకున్న బడ్జెట్‌లోనే దర్శకుడు సినిమా పూర్తి చేశాడని ప్రణయ్ చెప్పాడు. అంటే కొత్త వాళ్లతో సినిమా చేస్తున్నా ఖర్చు పెంచి భారీగా చూపించాలనే లెక్క కాకుండా, కథకు సరిపోయే స్థాయిలో పూర్తి చేసే పద్ధతిని ట్రై చేస్తున్నారు. 'రోమాంచకం' బాక్సాఫీస్ దగ్గర వర్కౌట్ అయితే అసలు మార్పు అక్కడి నుంచే రావచ్చు.

ఆరోగ్యం

నాటు గుడ్డు.. ఫారం గుడ్డు - ఎవరికి ఏది మంచిది..!?

కోడిగుడ్డు వినియోగం ఈ మధ్య కాలంగా గణనీయంగా పెరిగింది. కోడిగుడ్డు ఒక పోషకాల గని. గుడ్లలో అనేక పోషకాలు, విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉండటమే కాకుండా ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. అందువలన ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. షుగర్ ఉన్నవారు కూడా మితంగా గుడ్లు తినవచ్చు అంటున్నారు నిపుణులు. అయితే, నాటు కోడి గుడ్డు మంచిదా ఫారం కోడిగుడ్డు మంచిదా అనే సందేహం ఎక్కువగా కనిపిస్తోంది. దీని పైన పోషకాహార నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. కోడిగుడ్డులో మన శరీరానికి కావాల్సిన పోషకాలు ఉంటాయి. అలాగే, దీనిలో విటమిన్స్, మినరల్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. అందువలన వైద్యులు కూడా వీటిని తినమని చెబుతారు. అయితే, చాలా మందికి ఒక సందేహం ఉంది. మనం తినే గుడ్లలో నాటు కోడి గుడ్డు మంచిదా లేక ఫారం గుడ్డు మంచిదా అని. కాగా.. ఎక్కువగా బాయిల్డ్ ఎగ్ శరీరానికి చాలా మేలు చేస్తుందంట. ముఖ్యంగా ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. రోజుకు ఒక కోడి గుడ్డు తీసుకోవడం వలన ఇది గుండె పోటు, స్ట్రోక్, లేదా ఇతర హృదయ సంబంధ వ్యాధుల నుంచి కాపాడుతుంది. అంతే కాకుండా రక్త నాళాల్లో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. గుడ్డు తీసుకోవడం వల్ల శరీరం బరువును అదుపులో ఉంచుతుంది. అల్పాహారంగా కోడిగుడ్డును తీసుకుంటే మంచిది.

నిపుణుల సూచనలు అదే విధంగా ఫారం కోడిగుడ్డులోనైనా.. నాటు కోడి గుడ్డులోనైనా పోషకాలు ఒకే విధంగా ఉంటాయి. ఏ గుడ్డు తిన్నా.. పోషకాలు మాత్రం శరీరానికి పుష్కలంగా అందుతాయి. ప్రోటీన్ల స్థానంలో గుడ్డు అగ్ర స్థానంలో ఉంది. పప్పుల్లో ఉండే ప్రోటీన్లతో పోలిస్తే గుడ్డులోని ప్రోటీన్లే చాలా త్వరగా జీర్ణం అవుతాయి. ఇవి పిల్లల ఎదుగుదలకు సహాయపడతాయి. అందుకే గుడ్డును సంపూర్ణ ఆహారం అంటారు. నాటు కోడి గుడ్డులో పోషకాలు అధికంగా ఉంటాయని అంతా అనుకుంటారని.. కానీ అందులో వాస్తవం లేదని చెబుతున్నారు. ఈ రెండు రకాల గుడ్డుల్లో ఒకే పరిమాణంలో పోషకాలు ఉంటాయని వివరిస్తున్నారు.

గరం గరం ఇలాచీ టీ: రెగ్యులర్ చాయ్ కు బెస్ట్ ఆల్టర్నేటివ్

సాధారణంగా వేడి వేడి టీని ఇష్టపడని వారెవరూ బహుశా ఉండకపోవచ్చు. ఉదయం, సాయంత్రం వేళ.. టీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. వేడి వేడి టీ కడుపులో పడ్డాకే మిగిలిన పనుల్లో నిమగ్నమవుతారు. సాధారణ టీకి బదులుగా అందులో యాలకులను వేస్తే దాని రుచి మారిపోతుంది. ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. రెగ్యులర్ గా తాగే చాయ్‌కు మంచి ప్రత్యామ్నాయం కూడా. రోజువారీ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పును తీసుకొస్తుంది. వంటకాల్లో యాలకులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రాచీన కాలం నుండి వీటిని సువాసన కోసమే కాకుండా వివిధ రకాల ఆయుర్వేద మూలికా వైద్యంలో ఉపయోగిస్తున్నారు. దీన్ని టీ లో కూడా చేర్చుకోవడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. యాలకుల (ఇలాచీ) టీ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి అద్భుతంగా తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలు దెబ్బతినకుండా నిరోధిస్తాయి.

దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చలికాలంలో వేధించే గొంతు నొప్పి, శ్వాసకోశ ఇబ్బందుల నుండి త్వరితగతిన ఉపశమనాన్ని కలిగిస్తాయి. అలాగే రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్త ప్రసరణను క్రమబద్ధీకరించడంలో కూడా ఎంతగానో సహాయపడుతుంది. అధిక బరువుతో ఇబ్బంది పడేవారికి యాలకుల టీ ఓ మంచి ప్రత్యామ్నాయం. ఫ్యాటీ ఫుడ్ తీసుకున్నప్పుడు శరీరంలో అదనపు కొవ్వు పేరుకుపోకుండా యాలకుల పొడి అడ్డుకుంటుంది. దీనివల్ల బరువు నియంత్రణలో ఉంటుంది.

శ్వాసకోశ ఇబ్బందులతో సతమతమయ్యే వారికి యాలకుల టీ ఒక అద్భుతమైన సహజ సిద్ధమైన ఔషధంగా పనిచేస్తుంది. యాలకుల్లో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఊపిరితిత్తులలో పేరుకుపోయిన కఫాన్ని కరిగించి, శ్వాస ప్రక్రియను సులభతరం చేస్తాయి. జలుబు, దగ్గు, అస్తమా వంటి సమస్యలకు ఇది ఎంతో ఉపశమనం ఇస్తుంది. నోటి దుర్వాసనను దూరం చేసి, చిగుళ్ల వ్యాధులు రాకుండా అడ్డుకోవడం, నోటిలోని హానికర బ్యాక్టీరియాను అంతం చేయడంలో కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ మూలకాలు దంతాలపై పాచి పేరుకుపోకుండా కాపాడతాయి. యాలకలలో ఉండే సహజ సమ్మేళనాలు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల స్థాయిని సమర్థవంతంగా తగ్గించగలవు. జీర్ణవ్యవస్థను చురుగ్గా మార్చడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తొలగిపోతాయి. రోజూ ఉదయాన్నే లేదా సాయంత్రం సమయంలో ఈ వేడి చాయ్ తీసుకోవడం వల్ల హుషారుగా ఉండవచ్చు.

యాలకుల టీని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. పాలు, బ్లాక్ టీ పొడి, నల్ల మిరియాలు, యాలకుల పొడి, అల్లం ముక్కలు, దాల్చినచెక్క, లవంగాలు. ముందుగా ఒక గిన్నెలో తగినన్ని నీరు, పాలు పోసి బాగా మరిగించాలి. ఆ తర్వాత తాజా మసాలా దినుసులన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటి మరిగే పాలలో వేయాలి. పాలు మరిగేటప్పుడు దాల్చినచెక్క, లవంగాలు, అల్లం ముక్కలు, యాలకుల పొడితో పాటు కొద్దిగా నల్ల మిరియాలను కూడా చేర్చాలి. నీరు బాగా మరిగిన తర్వాత అందులో బ్లాక్ టీ పొడిని వేయాలి. అనంతరం గిన్నెపై మూత పెట్టి, మంటను తగ్గించి సుమారు పది నిమిషాల పాటు చిన్న మంటపై మరగనివ్వాలి. చివరగా వడకట్టుకుని, రుచి కోసం చక్కెరకు బదులుగా బ్రౌన్ షుగర్ లేదా తేనె కలుపుకొంటే వేడి వేడి యాలకుల టీ సిద్ధమవుతుంది.

రొయ్యల కారం పొడి.. ఇలా చేస్తే రుచిలో తగ్గేదేలే!

సాంప్రదాయ వంటకాలు మన వంటగదుల్లో ఈ మధ్య కాలంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటున్నాయి. వాటిలో కారప్పొడులకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంతకు ముందు చికెన్ కారం పొడి గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు సీఫుడ్ ప్రేమికులకు ఇష్టమైన రొయ్యల కారం పొడి తయారీ విధానం తెలుసుకుందాం. ఇది కారం, పులుపు రుచులతో నోరూరించే పొడి. సీఫుడ్ ఇష్టపడేవారికి ఇది ఒక మంచి, బెస్ట్ ఆప్షన్.

కావాల్సిన పదార్థాలు ఎండు రొయ్యలు - 1 కప్పు ధనియాలు - 2 టేబుల్ స్పూన్లు నూనె - 3 టేబుల్ స్పూన్లు మినపప్పు - 1 టేబుల్ స్పూన్ జీలకర్ర - 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి రెబ్బలు - 12 చింతపండు - నిమ్మకాయ పరిమాణం ఎండు మిర్చి - 15 కరివేపాకు - 2 రెమ్మలు ఉప్పు - తగినంత పసుపు - అర స్పూన్

తయారీ విధానం ముందుగా ఎండు రొయ్యల తల, తోక భాగాలను తీసి బాగా శుభ్రం చేసుకోండి. ఒక ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి సన్నని సెగ మీద రొయ్యలను క్రిస్పీగా అయ్యే వరకు వేయించి పక్కన పెట్టండి. అదే ప్యాన్‌లో మళ్ళీ కొద్దిగా నూనె వేడి చేసి ధనియాలు, జీలకర్ర, మినపప్పు, ఎండు మిర్చి, కరివేపాకులను దోరగా వేయించండి. వాటిని తీసి పక్కన ఉంచి, అదే ప్యాన్‌లో వెల్లుల్లి రెబ్బలు వేసి కొద్దిగా వేగనివ్వండి. నోరూరించే రొయ్యలకారం పొడి రెడీ వెల్లుల్లి

వేగిన తర్వాత చింతపండు వేసి చెమ్మపోయే వరకు ఒక నిమిషం ఉంచి తీసేయండి. అన్ని పదార్థాలు చల్లారిన తర్వాత ముందుగా ధనియాలు, జీలకర్ర, మినపప్పు, ఎండు మిర్చిలను గ్రైండర్‌లో పొడి చేయండి. తర్వాత కరివేపాకు, చింతపండు, వెల్లుల్లి రెబ్బలను కలిపి మెత్తగా పొడి చేసుకోండి. చివరగా వేయించిన రొయ్యలు, పసుపు, ఉప్పు కలిపి కొద్దిగా బరకగా ఉండేలా మళ్లీ గ్రైండ్ చేయండి. నోరూరించే రొయ్యలకారం పొడి రెడీ.

ఈ పొడి ఇలా అయితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది ఈ పొడిని అన్నం, ఇడ్లీ, దోసె, రొట్టెలతో కలిపి తినవచ్చు. సీఫుడ్ ఇష్టపడేవారికి ఇది ప్రత్యేకంగా నచ్చుతుంది. కారం, పులుపు కలయికతో రుచి అద్భుతంగా ఉంటుంది. ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే రొయ్యలు బాగా కరకరలాడేలా వేయించాలి. పొడిని గాలి చొరబడని గాజు సీసాలో నింపి మూత గట్టిగా బిగించి ఉంచండి. తడి తగలకుండా ఉంచితే నెల రోజుల పైనే నిల్వ ఉంటుంది. ఇలా సాంప్రదాయ పద్ధతిలో ఇంట్లోనే రొయ్యల కారం పొడి తయారు చేసుకుంటే ఆరోగ్యకరంగా, రుచికరంగా ఉంటుంది.

గోంగూర టమాటా శనగపప్పు కూర... ఇలా వండితే అన్నం మెతుకు మిగలదు!

నోటికి మంచి రుచి కావాలంటే పుల్ల పుల్లగా ఉండే గోంగూర, టమాటా, శనగపప్పు కూర వండుకు తింటే బాగుంటుంది. గోంగూర, టమాటా, శనగపప్పు కలిపి చేసే కూర ఆంధ్ర వంటల్లో చాలా ప్రాచుర్యం పొందినది. ఈ కూర వేడి వేడి అన్నంలో బాగా సరిపోతుంది. ఈ కూరను చేయడం చాలా సులభం. చాలా ఈజీగా కుక్కర్ లో ఈ కూరను తయారు చేసుకోవచ్చు.

కావాల్సిన పదార్థాలు: గోంగూర ఆకులు - 2 కట్టలు (శుభ్రంగా తెంచినవి) టమాటాలు - 2 నుంచి 3 (మధ్యస్థం) శనగపప్పు - ¾ కప్పు (2 గంటలు నానబెట్టి) ఉల్లిపాయలు - 1 పెద్దది పచ్చిమిర్చి - 3 నుంచి 4 వెల్లుల్లి రెబ్బలు - 15 ఇంగువ - చిటికెడు ఆవాలు, జీలకర్ర, కరివేపాకు - తగినంత ఎండు మిరపకాయలు - 2 ఉప్పు, కారం, పసుపు - రుచికి తగ్గట్టు నూనె - 3 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: స్టవ్ వెలిగించి స్టవ్ పైన కుక్కర్ పెట్టి అందులో గోంగూర, టమాటా, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయలు అన్నీ ముక్కలుగా కట్ చేసినవి మరియు శనగపప్పు వేసి మూడు విజిల్స్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత కుక్కర్ విజిల్ వదిలాక కొద్దిగా పసుపు, స్పూనున్నర ఉప్పు, 2 స్పూన్ల కారం వేసి అంతా కలిపి మాష్ చెయ్యాలి. ఆపై అందులో పోపు చేసుకోవాలి.

ఇలా చేస్తే సూపర్ టేస్టీ గోంగూర, టమాటా, శనగపప్పు పులుసు కూర పోపు కోసం స్టవ్ వెలిగించి 3 టేబుల్ స్పూన్ల నూనె వేసి అందులో ఎండు మిరపకాయలు, వెల్లుల్లి రెబ్బలు, పోపు గింజలు, కరివేపాకు వేసి పోపు చేసుకోవాలి. ఆ తర్వాత ఆ పోపును వండుకున్న పులుసు కూరలో కలిపి మళ్ళీ కొద్దిసేపు ఉడికించాలి. అంతే రుచికరమైన గోంగూర, టమాటా, శనగపప్పు పులుసు కూర రెడీ అవుతుంది. ఇంకెందుకు ఆలస్యం కుక్కర్ లో చాలా సులభంగా తయారు చేసుకునే ఈ రెసిపీని మీరు కూడా ఒకసారి ట్రై చెయ్యండి.

సిరిసిల్లలో ఘనంగా భక్త మార్కండేయ శోభయాత్ర

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 28 : సిరిసిల్లలో భక్త మార్కండేయ శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. నూలు పౌర్ణమి సందర్భంగా సిరిసిల్లలో పద్మశాలి కుల బాంధవులు మార్కండేయ గుడి నుండి పద్మశాలి కుల బంధువులు మార్కండేయ శోభయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని శోభయాత్రను విజయవంతంగా నేతన్న చౌక్ వద్దకు చేరి అక్కడ నేతన్న విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి అతిథులుగా హాజరయ్యారు.

కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

- జంతు సంరక్షణలో పక్షులు కూడా భాగమే
- కోడి పందాలను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించలేం
- సినిమాలు, ఆచారాలు చూపి..పందాలను నడపడం సాధ్యం కాదు
- మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టీకరణ

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, ఆగస్టు 28 : కోడిపందేలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ పందేలు నిర్వహించడం చట్టపరిధిలో పూర్తిగా నిషేధమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. గతంలో అనుమతులిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరంగా చెల్లవని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కోడిపందేల నిర్వహణ పౌరుల ప్రాథమిక హక్కు కాదని తేల్చిచెప్పారు. జంతు హింస నిరోధక చట్టం-1960 ప్రకారం కోడిపందేలు తీవ్ర నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. 'రిట్ ఆఫ్ మాండమస' కింద అనుమతులు జారీ చేయలేమని తేల్చిచెప్పారు. కోడిపందేలకు 'సంస్కృతి' హోదా ఇవ్వలేమని పేర్కొన్నారు. సినిమాలు, ఆచారాల్లో ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఈ పందేలను సాంస్కృతిక క్రీడగా గుర్తించలేమని తెలిపారు. జల్లికట్టు తరహాలో ప్రత్యేక చట్టసవరణ లేనంతవరకు మినహాయింపులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కత్తులు కట్టకపోయినా పందేలు నేరమేనని చెప్పుకొచ్చారు. కత్తులు లేవనే సాకుతో ఈ పందేలకు అనుమతి కోరిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమ చట్టంలో 'పక్షులు' కూడా భాగమేనని స్పష్టం చేశారు. జల్లికట్టు లాగా ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తేనే మినహాయింపు దక్కుతుందని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు. గతంలో కోడిపందేలకు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. గత తీర్పులను భవిష్యత్తు కేసుల్లో నిదర్శనంగా పరిగణించరాదని తెలిపారు. ఆయా షరతులతో కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పాత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్‌లో కీలక తీర్పు వెల్లడించారు. కత్తులు కట్టకుండా నిర్వహించినా కోడిపందేలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పక్షులకు గాయాలు కాకుండా చూడాలనే షరతులతో ఇచ్చిన పాత అనుమతులు కూడా చట్టానికి విరుద్ధమేనని తెలిపారు. జంతు హింస నిరోధక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఈ పందేలకు అనుమతి ఇవ్వలేమని అన్నారు. కోడిపందేలకు అనుమతి ఇచ్చిన గత డివిజన్ బెంచ్ ఉత్తర్వులు 'పూర్తిగా అనవసరం' అని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది.

చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను' అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు. మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఎ÷-లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ వక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఎ÷-లాట్లకు 600 మంది లబ్దిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం

మొదటిపేజీ తరువాయి

రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్దిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

అప్రమత్తతే దొంగతనాలకు అడ్డుకట్ట

పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెబ్బేరు, ఆగస్టు 28: బస్సుల్లో,రద్దీ ప్రాంతాల్లో జరిగే దొంగత నాల పట్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించి బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు దొంగలు చుట్టూ ఉం డే అవకాశం ఉందని హెచ్చరించారు. డబ్బులు, బంగారు ఆభరణా లు, విలువైన వస్తువులను బహిరంగంగా ఉంచవద్దని, సురక్షిత బ్యాగులో ముందుభాగంలో జిప్ వేసి ఉంచుకోవాలని నగదుకు బదులు డిజిటల్ చెల్లింపులను వాడాలని సూచించారు. ప్రయాణం లో మొబైల్ ఫోన్ లో మునిగిపోకుండా చుట్టూ గమనిస్తూ ఉం డాలని,గుర్తుతెలియని వ్యక్తులను దగ్గరకు రానివ్వవద్దని, ఏటిఎం పిన్, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. నిద్ర సమ యంలో బ్యాగులను కుటుంబ సభ్యులకు అప్పగించాలని, అను మానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి

సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయని చెప్పారు. తీవ్ర నేరాల్లో 10.33శాతం తగ్గాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

అమెరికాలో తెలుగు యువతి హత్య

మొదటిపేజీ తరువాయి

ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో శర్మపై ఫస్ట్-డిగ్రీ, సెకండ్-డిగ్రీ హత్యారోపణలతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దీంతో నిందితుడు భారత్‌కు పారిపోయి వచ్చాడు. మరోవైపు, డిసెంబర్ 31, 2025న నిఖిత హత్యకు గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులకు భారత అధికారులు సమాచారం అందించారు. నిఖిత తండ్రి ఆనంద్ గోదిశాల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తెలంగాణలోనూ అర్జున్‌పై మోసం కేసు నమోదైంది. నిఖిత నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏప్రిల్‌లో కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో లభించిన ఆధారాలతో ఆగ్రాలో అర్జున్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఓ ఎ÷-లాట్‌లో అతడిని అదుపులోకి తీసుకుంది. అనంతరం హత్య కేసు దర్యాప్తులో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించారు. న్యూఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ఆగస్టు 25న హాజరుపరుచగా.. హత్యకు సంబంధించిన కేసులో రిమాండ్ విధించింది.

గనులశాఖలో అవినీతి మేట

మొదటిపేజీ తరువాయి

ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జయరాజ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేపట్టినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. జయరాజ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ గతంలోనే గనుల శాఖ అధికారులు హెచ్చరించారు కూడా. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ తీరులో మార్పు రాలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో జయరాజ్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందడంతో దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని జయరాజ్ నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ లెక్కల ప్రకారం జయరాజ్‌కు సంబంధించిన సుమారు రూ.65 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, తూప్రాన్, తుంగతుర్తి, సూర్యాపేటలో ఒక్కో ఎ÷-లాట్, కీసరలో రెండు ఇంటి స్థలాలు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీలో విలువైన మరో ప్లాట్‌ను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు రూ.20 లక్షల విలువైన ఎల్ఐసీ బాండ్లు, రూ.20 లక్షలకు పైగా పోస్టాఫీస్ సేవింగ్స్, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సుమారు రూ.40 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జయరాజ్ తన ఇంటి డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి తన కుమార్తె ఖాతాలోకి రూ.24 లక్షలు బదిలీ చేయించినట్లు కూడా ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ లావాదేవీలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. సోదాల్లో బయటపడిన ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంకు లావాదేవీల ఆధారంగా జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు.

పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

మొదటిపేజీ తరువాయి

ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ ఫోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

బంగారు గని రాయదుర్గం భూమి

మొదటిపేజీ తరువాయి

నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణ యించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరా లను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండిన్నట్లైం ది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

మొదటిపేజీ తరువాయి

జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్యపరిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

బంగారం మైనింగ్‌లో హట్టి - సింగరేణి జతకట్టాలి

మొదటిపేజీ తరువాయి

సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు. అనంతరం యుటీ భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

బిసి, ఇబిసి విద్యార్థులకు చేయూత

మొదటిపేజీ తరువాయి

100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తు దారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి. విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. జిఆర్ఇ, జిమాట్ స్కోర్‌తో పాటు టోఫెల్ తదితర పరీక్షల్లో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థు లకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

రక్షణ రంగంలో మరో ముందడుగు

మొదటిపేజీ తరువాయి

జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ ఫర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల ట్యాంకులు, బంకర్లు, సాయుధ వాహనాలను ధ్వంసం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

మొదటిపేజీ తరువాయి

పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సల్యం ప్రకటించారు.

వీధి వ్యాపారుల షాపుల తొలగింపు మున్సిపాలిటీ పాలక వర్గానికి సంబంధం లేదు

- షాపుల తొలగింపు నిర్ణయం నేషనల్ హైవే అథారిటీదే
- బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేయడం సరికాదు...
- వీధి వ్యాపారులకు అన్యాయం జరకుండా అండగా ఉంటా...
- కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బ్యాంగి రత్నమాల ఆనంద్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కల్వకుర్తి, ఆగస్టు 28 : కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాగర్ కర్నూల్ చౌరస్తాలో వీధి వ్యాపారుల షాపుల తొలగింపు వ్యవహారంలో కల్వకుర్తి మున్సిపాలిటీ పాలక వర్గానికి ఎలాంటి సంబంధం లేదని మున్సిపాలిటీ చైర్ పర్సన్ బ్యాంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్,లు స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ చైర్ పర్సన్ బ్యాంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు నాగర్ కర్నూల్ చౌరస్తాను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ బ్యాంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ హైవే విస్తరణలో భాగంగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించాలని నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయం తీసుకుందని కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాగర్ కర్నూల్ చౌరస్తాలో ఉన్న వీధి వ్యాపారుల షాపుల తొలగింపు ప్రక్రియ పూర్తిగా వారి పరిధిలోని దేనని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేయడం సరికాదు...

వీధి వ్యాపారుల సమస్యను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనవసర రాజకీయం చేయడం సరికాదని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బ్యాంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పదేళ్ల పాటు కల్వకుర్తి మున్సిపాలిటీలో పదవులు అనుభవించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా మున్సిపాలిటీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు.తాను ఎల్లప్పుడూ పేదల పక్షానే ఉంటానని కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వీధి వ్యాపారులు ఆందోళన చెందవద్దని కల్వకుర్తి మున్సిపాలిటీ పాలకవర్గం వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంట కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కల్కోజు రాజేష్ కుమార్,నాజియా మక్బూల్,చిత్తారి ఎల్లమ్మ శ్రీనివాసులు,రమాకాంత్ రెడ్డి,గణేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాహియాఖాన్,నాయకులు పడకంటి వెంకటేష్,దున్న సురేష్,తదితరులు ఉన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనం

జిల్లా యువజన, క్రీడల అధికారి డా. ఓ.జ్యోతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఖేలేగా భారత్–జీతేగా భారత్ నినాదంతో ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం మహబూబాబాద్‌లోని టీజీఎంఆర్ఎస్ బాలుర పాఠశాల–1లో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి డా.ఓ.జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డా.ఓ.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం పెంపొందుతాయని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

డీఎస్పీ మహేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, ఆగస్టు 28 : మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 53 ఏళ్ల మహిళపై జరిగిన అత్యాచారం కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ ఘటనపై మక్తల్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ మహేష్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివ రాలు వెల్లడించారు. మహిళపై జరిగిన అత్యాచారం కేసులో మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫై.నెం.342/2026, సెక్షన్ 70 1బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి బాధితురాలిని రక్షించి మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. మహిళా ఎస్ఐ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన వారు మక్తల్ చెందిన బోయ అరవింద్ 19, బోయ విజయ్ 19 లను అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన తదుపరి చట్టపరమైన ప్రక్రియలో భాగంగా రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. కేసును త్వరగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మక్తల్ సీఐ రామ్లాల్, ఎస్సై రాజుతో పాటు పోలీస్ సిబ్బందిని డీఎస్పీ మహేష్ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ... మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బాధితురాలికి అవసరమైన పోలీసు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కేసులో తదుపరి దర్యాప్తు మరియు చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని డీఎస్పీ తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- గుడిసెల సర్వేను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ.
- సెప్టెంబర్ 15 నాటికి నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఆగస్టు 28: జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు గుడిసెల సర్వేను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, డీఆర్‌డీఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా మంజూరైన ఇళ్లు, నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, గుడిసెల సర్వే తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు 4,562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 851 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ఆర్‌సీసీ, రూఫ్ లెవెల్ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 15 నాటికి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. భూపాలపల్లి మండలంలో అదనంగా 200 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 1,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాని లబ్ధిదారుల విషయంలో నిధుల కొరత, లబ్ధిదారుల అనాసక్తి, సాంకేతిక లేదా ఇతర కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన పేద కుటుంబాలందరికీ ఇళ్లు మంజూరు చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గుడిసెల సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అర్హత ఉన్న ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. భాస్కర్‌గడ్డ 2బీహెచ్‌కే లేఅవుట్‌లో సీవరేజ్, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారుల బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 31న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల పురోగతి, పెండింగ్ అంశాలు, లక్ష్యాల సాధనకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

అన్న చెల్లెళ్ల, అక్క తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్

వడ్డేపల్లి రాజేశ్వరరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ పౌర్ణమి కార్యక్రమానికి నియోజకవర్గంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు వడ్డేపల్లి రాజేశ్వరరావుకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాజేశ్వరరావు సతీమణి యామినితో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని మహిళలతో రాఖీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మహిళలతో కలిసి రాఖీ పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- తల్లిదండ్రులు పాఠశాల, కళాశాల యజమాన్యాలు విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తుండాలి
- విద్యా సంస్థలలో విద్యార్థులకు సామాజిక నైతిక విలువలను అందించాలి
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలి :: ఏబీవీపీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, ఆగష్టు 28 : మఖ్తల్ పట్టణ కేంద్రంలో 27 ఆగస్టు తెల్లవారు జామున ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదాన ప్రాంగణంలో ఉన్న ఒక మహిళపై మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు అత్యాచారం చేసి ఆమెను తీవ్రంగా గాయపరచడమే కాకుండా తన తల్లిపై జరుగుతున్న ఆ అమానుష ఘటనను అడ్డుకునే ప్రయత్నం చేసి12 ఏళ్ళకొడుకును తీవ్రంగా గాయపరచడం సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది. పై సంఘటనకు కారకులైన వారిని తీవ్రంగా శిక్షించాలని ఏబీవీపీ తరఫున డిమాండ్ చేస్తూ మఖ్తల్ పట్టణంలో ఇప్పటికే ఉన్న పోలీసుల నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని రాత్రి పూట పెట్రోలింగ్ నిబంధనలను మరింత కఠినం చేయాలని కోరారు. మఖ్తల్ పట్టణ కేంద్రంలో సిటీ కల్చర్ పేరుతో కొందరు యువకులు మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్నారని విచ్చలవిడి దూమపానం, మద్యపాన వినియోగాలతో అనారోగ్య సమస్యలతో పాటు అనేక చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారని కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులతో పాటు కుటుంబ సభ్యుల పర్యవేక్షణతో మాత్రమే ఈ మాదకద్రవ్యాల మహమ్మారిని నియంత్రించడానికి వీలవుతుందని అన్నారు. మఖ్తల్ పట్టణంలో ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా కొనుగోలు చేసే సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యంకావాలని సూచించారు. రాత్రి వేళలో ఇష్టాను సారంగా అమ్మకాలు జరిపే బెల్ట్ షాపులతో పాటు, పాన్ షాపులు సిగరెట్ గుట్కా వంటి నిషేధిత పదార్థాల క్రయవిక్రయాలు జరిగే స్థలాలపై కూడా దృష్టి సారించాలని పోలీసు శాఖను కోరారు. మక్తల్ పట్టణ కేంద్రంలోని కొన్ని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కూడా రక్షణ లేని వసతుల కారణంగా కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్నది కావున సీసీటీవీ పర్యవేక్షణ, లైటింగ్ ఏర్పాటుచేయడం వంటి భద్రత చర్యలు తీసుకోవాలని పాఠశాల కళాశాలల సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు వినయ్ కుమార్, అంబ్రేష్, రమేష్, వినయ్,శివ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

బండి రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, ఆగస్టు 28 : కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మహిళా నాయకు రాళ్లు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్, మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.పార్టీలకు అతీతంగా మహిళలకు ఎలాంటి కష్టంవచ్చినా అండగా ఉం టానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బండి రమేష్ హామీ ఇచ్చారు. మహిళలు కుటుంబంతో పాటు సమాజం, రాజకీయాలు, విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితర అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళు ,, కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల నిరసనలో సీఐ దూకుడు... కోదాడలో రచ్చ...!

- బాధితుల శాంతియుత నిరసనలో ఉద్రిక్తత... రాఖీ పండగ నాడే మహిళలపై దాడి ఆరోపణలు..
- సీఐపై చర్యలు తీసుకోవాలి... బొల్లం మల్లయ్య యాదవ్, ఇమ్రాన్ ఖాన్ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ, ఆగస్టు 28 : కోదాడ పట్టణంలో డబ్బకొట్టు తొలగించారంటూ బాధితులు రోడ్డుపై బైఠాయించి శాంతియుతంగా నిరసన చేపట్టగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న పట్టణ సీఐ శివశంకర్.. మాదాల ఉపేందర్‌పై దాడి చేసి రోడ్డుపైకి నెట్టేసి, అనంతరం పోలీసు వాహనంలోకి లాక్కెళ్లినట్లు బాధితులు ఆరోపించారు. ఉపేందర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను కూడా పోలీసులు తోసివేసి, వారిపై చేయి చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రాఖీ పండగ రోజునే మహిళల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆరోపణలు రావడం కోదాడలో తీవ్ర చర్చకు దారితీసింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత 30 ఏళ్లుగా డబ్బకొట్టు ఆధారంగా జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. తమ జీవనోపాధిని తొలగించడంతో న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా స్పందించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజలపై చేయి చేసుకుంటే సామాన్యుడు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న బాధితుడిపై దాడి చేయడం, అడ్డుకున్న మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారనే ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని అన్నారు. రాఖీ పండగ రోజున మహిళలపై పోలీసులు చేయి చేసుకున్నారనే ఆరోపణలు రావడం మరింత బాధాకరమని మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. పోలీసులు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా చట్టానికి విధేయులుగా పనిచేయాలని, అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదాల ఉపేందర్, ఆయన కుటుంబ సభ్యులపై జరిగిన ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే పట్టణ సీఐపై సస్పెన్షన్‌తో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజలపై చేయి చేసుకుని వారి గొంతును అణచివేయలేరని, ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

సోదర, సోదరీమణుల ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీక



- మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్
- సమాజంలో సోదరభావం, కుటుంబ బంధాలను బలోపేతం చేసే స్ఫూర్తి రక్షాబంధన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఆగస్టు 28 : సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బ్రహ్మకుమారీలు కలెక్టర్‌కు రాఖీ కట్టి, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలో పరస్పర గౌరవం, సోదరభావం, ఆప్యాయతలను పెంపొందించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. సోదరీమణుల రక్షణ, గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి హక్కులు, భద్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. రాఖీ పండుగ కేవలం సోదర, సోదరీమణుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాకుండా.. సమాజంలో ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పరస్పర సోదరభావంతో ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

సోదరీమణులతో రాఖీలు కట్టించుకున్న మాధవరం రంగారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కూకట్‌పల్లి, ఆగస్టు 28 : రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సోదరీమణులతో రాఖీలు కట్టించుకున్నారు. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, కలిదిండి రోజాతో పాటు వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్లకు చెందిన సోదరీమణులు రంగారావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సోదరీమణుల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు తనకు కొండంత అండగా ఉంటాయని, తాను కూడా వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No . 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com